'సాయినాథ్' అంటే?

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

సుమారు 1856 ప్రాంతంలో రెండవసారి చాంద్ పాటిల్ మేనల్లుడి పెళ్లి పరివారంతో కలిసి శిరిడీ చేరిన ఫకీరును మహల్సాపతి 'యా సాయి' అని ఆహ్వానించడంతో సాయి నామం ఆయనకు జగద్విఖ్యాతమైన పేరుగా నిలిచిపోయింది. సాయి అంటే 'స్వామి' లేక 'మహనీయుడు' అని అర్థము. బాబా అన్న పదానికి 'తండ్రి', 'నాన్న' అని అర్థము. ఈ పదం ప్రాచీన యూదుభాష లోని 'అబ్బా' అన్న పదానికి సరిపోతుంది. ఏసు క్రీస్తు ఎప్పుడూ భగవంతుని 'తండ్రి' అని గౌరవంగా ప్రస్తావించేవారు. అటువంటిది ఆయనను యూదులు శిలువ వేసినప్పుడు ఆయన ఎంతో బాధచెంది, పెద్దగా 'అబ్బా' అని భగవంతుని కేకవేసి పిలుస్తూ ప్రాణాలు విడిచినట్లు బైబిల్ చెబుతుంది. అక్కడ అబ్బా అన్న పదాన్ని వ్యాఖ్యానిస్తూ విలియం బార్క్లే అను పండితుడు "ఆ పదం అతిచనువు, ప్రేమలతో కూడిన 'నాన్నా' అన్న పదానికి సరిపోయేది" అన్నారు. 'బాబా' అన్నది కూడా అలాంటిదే. సాయిబాబా అంటే ఈ ఫకీరు 'మహనీయుడు', 'గురువు' మాత్రమే కాక తన భక్తులకు 'తండ్రి' అన్నమాట. అంటే కేవలం శిష్యుని అర్హతానర్హతలను మాత్రమే ఎంచి ఆత్మోన్నతిని మాత్రమే ప్రసాదించేవారుగాక, కన్నబిడ్డలలాగా తన ఆశ్రితులను ప్రేమించి, వారి తప్పులను ప్రేమతో మన్నించేవారని అర్థం. ఈ భావాన్నే క్రీస్తు తాము ప్రత్యేకంగా పాపులను తరింపచేయడానికే అవతరించామని చెప్పారు.

అయితే ఎలా వచ్చిందో కానీ సాయికి 'సాయినాథ్' అన్న పేరు కూడా వచ్చింది. స్థూలంగా చెప్పాలంటే సాయి (మహనీయులకు) 'నాథుడు' లేక ప్రభువు అని అర్థమొస్తుంది. అంటే సత్పురుషులులో మేటియని అర్థము.

నిజానికి సాయి మహనీయులలోకెల్లా తలమానికమని, కోహినూరు వంటివారని ఆయన సమకాలికులైన మహనీయులే అన్నారు. శ్రీ మెహర్ బాబా కూడా ప్రపంచంలోని వివిధ మహనీయులందరికీ శ్రీ సాయి సామ్రాట్ అని, ఆయన విశ్వానికే గురువు అని కూడా అన్నారు.

కానీ 'నాథ్' అన్న పదానికింకా విశేషమైన అర్థం కూడా వున్నది. యోగవిద్యలో 'నాథ' సాంప్రదాయం వున్నది. గోరక్ష, మత్స్యేంద్ర, గహనీ నాథులు మొదలుగా తొమ్మిదిమంది మహాయోగులు వుండేవారు. వీరి సాంప్రదాయంలో అష్టాంగ, మంత్ర, తంత్ర, యంత్ర విద్యలన్నీ సమ్మేళనం చెంది వుంటాయి. ఈ నవనాథులు యోగుల ప్రపంచంలో ప్రచండ ప్రకాండులు. శ్రీ సాయిబాబా కూడా ఈ సాంప్రదాయానికి చెందినవారని యా పేరు తెలుపుతుంది. 'సాయినాథ్ మహారాజ్' అన్న పేరులో మూడు అంశాలు ఉన్నాయి. 'సాయిబాబా', 'నాథ్', 'మహారాజ్'. 'సాయి'– స్వామి: 'బాబా'– తండ్రి. ఇక్కడ తండ్రి యనే ప్రేమ, స్వతంత్రమూ వున్నాయి. గురువన్న భావమూ ఉన్నది. 'నాథ్' అన్నప్పుడు యోగుల ప్రపంచంలో ఆయనకున్న ఉత్తమ స్థానం సూచించబడుతుంది. 'మహారాజ్' అన్నప్పుడు తన మహిమచేత విశ్వాన్నంతటినీ భాసింప జేయగల పరమేశ్వరతత్వం స్ఫురిస్తుంది. ఆయనయే తండ్రి, గురువు, దైవమూ. తన భక్తులకు, యోగులకూ నాథుడు. ●

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 ఫిబ్రవరి - 2024 సంచిక:10

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"

విషయ సూచిక

01.	'సాయినాథ్' అంటే?	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	05
03.	శ్రీ సాయినాథుడు వెలిగించిన జ్ఞానజ్యోతి	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	06
04.	మాతృదేవి స్మృతులు	శ్రీమతి నాగలక్ష్మి	13
05.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	14
06.	భగవాన్ శ్రీ భరద్వాజ	శ్రీమతి శ్రీదేవి	18
07.	శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు	శ్రీమతి శ్రీదేవి	21
08.	సమాధి లీల	శ్రీ డబ్ల్యు.రామకృష్ణ	23
09.	మాతృదేవి దివ్య సన్నిధిలో దత్త జయంతి వేడుకలు!	శ్రీమతి టి.పద్మావతి	25
10.	ద్వారకామాయి అనుభవమండపము	శ్రీమతి పిసుపాటి సుబ్బమ్మ	27
11.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీ దామోదర్	28

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
www.saibharadwaja.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :- సాయిచిత్రము ప్రతిదాని మీద ముద్రిస్తుంటే ఆ కాగితాలు చెత్తలో పడతాయి, అది తప్పు గదా?

- జి. పిచ్చయ్య,(ఖమ్మం)

జవాబు :- సాయి ఎప్పుడూ సర్వగతుడే - ఆలయాలు, జీవులు, ధూళి రేణువుల దగ్గరనుండి ఆయనే - ఆ సంగతి గుర్తుంచుకునే సాధనయే మనం ముద్రించుకొనే బొమ్మలు. చెత్తలో కూడా ఆయనే వున్నాడన్న ఎరుక కల్గించడానికి అదీ పనికివస్తుంది. ఆ దృష్టి కలిగియుంటేచాలు. అది మరవడమే నిజానికి సాయిని చెత్తకుప్పలో పడవేయడం వంటిది.

నామదేవుడికి ఒక శివాలయంలో విఠోభాకేశుడనే పండు ముసలి శివలింగంపై కాళ్ళు పెట్టుకు పడుకొని దర్శనమిచ్చాడు. నామదేవుడు అభ్యంతరం చెబుతే శివుడు లేనిచోట తమ పాదాలుంచమని కోరాడు. నామదేవుడతని పాదుకలు ఎక్కడ పెడితే అక్కడ శివలింగం ప్రకటమై నామదేవునికి జ్ఞానోదయమైంది. ఆ దృష్టి కలిగేలోగా యివన్నీ తప్పవు. ముద్రిస్తే కొన్ని నష్టాలు, ముద్రించకుంటే కొన్ని నష్టాలు వున్నాయి. ప్రతిదానిని సాధనంగా మల్చుకుంటూపోవాలి. ●

ప్రశ్న :- నాకు ప్రశాంతమైన ఆశ్రమ జీవితమూ, భగవంతుని సేవ కావాలన్పిస్తున్నది. నేనేమి చేయాలి?

- పి. నీలవేణి, 10వ తరగతి, మైలవరం డామ్

జవాబు :- చక్కని ఆశ్రమ జీవితం అంటే ఉద్యోగంచేసి, రిటైరు అయి ఫించను తీసుకోవటం, ప్రశాంతంగా జీవించటంలాంటిది. అది హాయిగానే వుంటుంది. కానీ అలా ఫించను రావాలంటే అంతకుముందు చక్కగా ఉద్యోగం కష్టపడి చేయాలి. అందుకు అంతకుముందు చక్కగా చదువుకోవాలి. అలా చేయనివారికి జీవితాంతమూ కష్టము చేసికొని చాలీచాలని బ్రతుకు తప్పదు. అలానే మనం ఈ చదువులు చక్కగా చూచుకుంటూనే మిగిలిన నా రచనలు చదివి ధర్మం తప్పక 'సాయిప్రబోధామృతంలో' చెప్పినట్లు, ఈ ప్రపంచంలోని కష్టసుఖాలు ఎదుర్కొంటూ జీవించాలి. ఇది కష్టమన్పించినా బలాన్ని పెంచుకునే వ్యాయామం వంటిది. చివరకు కష్టాల రూపంలో వెనుకటి పాపాలు కడిగేసుకున్నాక, మనమాచరించిన ధర్మం పేరున పుణ్యం పేరుకొని ఫించనులాగ ఆశ్రమ జీవితాన్ని తగిన సమయంలో యిస్తుంది. అపుడు పరిస్థితులు వాటికవే సాయి దయవలన అనుకూలిస్తాయి. ఈలోగా అందుకోసం ప్రయత్నిస్తే పాపం పెరుగుతుంది - వాడని కత్తి తుప్పు పట్టినట్లు, వ్యాయామం లేని శరీరం బలహీనమై, రోగాలు వచ్చి ముసలితనంలో బాధపడవలసి వచ్చినట్లు. కనుక జీవిత కష్టసుఖాలలో వుంటూనే వాటిని న్యాయంగా ఉపయోగించుకొని, ఆత్మబలాన్ని, ఆరోగ్యాన్ని పెంచుకోవాలి. అదెలాగో నా రచనలలో వున్నది. ●

(ఫిబ్రవరి 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)

శ్రీ సాయినాథుడు వెలిగించిన జ్ఞానజ్యోతి

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

అది 1963వ సంవత్సరము, ఫిబ్రవరి తొమ్మిదవ తేది. ఉదయం సుమారు 7:30 గంటలు. శిరిడీలో సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని సమాధి మందిరంలో హారతి, అభిషేకము పూర్తవడంతో భక్తులందరూ వెళ్ళిపోయారు. అందుకని సమాధి మందిరం ప్రశాంతతను సంతరించుకున్నది. సమర్థ సద్గురుడైన శ్రీ సాయినాథుడు వేదిక మీద విగ్రహరూపంలో ఆసీనులై కనిపించీ కనిపించని చిరునవ్వు చిందిస్తూ అలౌకిక దృష్టిని సారిస్తున్నారు. ఆయన ఎవరి కోసం ఎదురు చూస్తున్నారో, ఏ పిచ్చుకకు దారం కట్టి లాగుతున్నారో అప్పుడు ఎవరికి తెలుసు!

సరిగ్గా అప్పుడే సమాధి మందిరం యొక్క ఉత్తర ద్వారం నుంచి ఒక యువకుడు మందిరం లోపలకు ప్రవేశించాడు. దక్షిణ ద్వారం నుంచి బయటకు వెళ్ళాలని అతని ఉద్దేశ్యం. కాని సమర్థ సద్గురువైన సాయి పిలుపును అతను మాత్రం ఎలా తప్పించుకోగలడు? అందుకే అతడు మధ్యలోనే సమాధి మందిరంలో ప్రతిష్ఠితమైవున్న శ్రీ సాయినాథుని విగ్రహాన్ని చూడాలనే కుతూహలంతో మందిరం లోపలికి ప్రవేశించాడు.

సుమారు 25సం॥ల వయస్సుగల అతనిలో నిర్దుష్టమైన వ్యక్తిత్వంతో కూడిన ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్నది. ఈ నిశితమైన దృష్టితో విగ్రహరూపంలో వున్న శ్రీ సాయినాథుని వ్యక్తిత్వాన్ని అంచనా వేయాలని అతని సంకల్పం. కాని బాబా సంకల్పం ఏమిటో! సమాధి మందిరం లోపలికి ప్రవేశించిన అతడు సాయి విగ్రహానికి ఎదురుగా కుడివైపున వున్న స్తంభం దగ్గర నిలబడి ఆ విగ్రహం యొక్క కళ్ళలోకి తన దృష్టిని సారించాడు. 'నాపై నీ దృష్టి నిలుపు, నేనూ నీపై నా దృష్టి నిలుపుతాను' అన్న సాయి తన మాటను అక్షరాలా నిలబెట్టుకున్నారు. ఆయన తన కృపాదృష్టిని ఆ యువకునిపై ప్రసరింపజేసారు! అంతే! అతనికి ఏమి జరుగుతున్నదో అతనికే తెలియదు! నిలబడివున్న అతడు కూర్చుండిపోయాడు. కళ్ళు తెరిచి చూస్తున్న అతడి కళ్ళు మూతబడ్డాయి. విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంతో చేయబడివున్నదో అదే సాయి రూపమని, సాయి నిజతత్త్వమని, అదే తాను కూడా అనీ అతనికి అనుభవమైంది. అలా 5,6 గం॥ల సేపు అతడు సమాధి స్థితిలో వుండిపోయాడు!!

అంతటితో సృష్టితత్త్వం గూర్చి, భగవంతుని గూర్చి అంతకుముందు అతడు చేసిన అన్వేషణ పూర్తయింది. అతి స్పష్టమైన, నిర్దుష్టమైన సిద్ధాంతం అతనిలో రూపుదిద్దుకుంది.

అంతటితో అతని జీవితమే మారిపోయింది!

అతని పేరు ఎక్కిరాల భరద్వాజ. అతనొక కాలేజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్నాడు. అతడు సాంప్రదాయకమైన వైష్ణవ కులంలో జన్మించినప్పటికీ తన 16వ ఏట జరిగిన ఒక దుర్ఘటన వల్ల భగవంతుని ఆస్తికత పట్ల సంశయాత్మకుడై, సృష్టితత్త్వాన్ని గూర్చి నిరంతరాన్వేషణతో ఒక నిర్దుష్టమైన అవగాహనకు వచ్చివున్నాడు. తనకు భగవంతుని పట్ల, బాబాల పట్ల విశ్వాసం లేనప్పటికీ కేవలం తన అన్నగారి బలవంతంపై ఆయనకు తోడుగా మాత్రమే శిరిడీ వచ్చాడు. అయితే సాయినాథుని వద్ద కలిగిన అనుభవంతో అతడు పూర్తిగా మారిపోయాడు. ఇప్పుడతడు పూర్వపు భరద్వాజ కాడు, శ్రీ సాయినాథునికి ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న పూజ్యశ్రీ మాస్టరుగారు, శ్రీ సాయి మాస్టరుగారు.

ఆ రోజున శ్రీ సాయినాథుని సంపూర్ణ అనుగ్రహాన్ని పొందిన ఆయనకు అప్పటినుంచి మరొక ధ్యాసే లేదు. నిరంతరం సాయిని గూర్చిన తలంపులే! ఆయన దర్శనం మళ్ళీ మళ్ళీ చేసుకోవాలనే తపన! అందుకని అవకాశం వున్నప్పుడల్లా శిరిడీ వెళుతుండేవారు. తనివితీరా సాయిని దర్శించుకునేవారు. అయినా ఆయనకు తృప్తి కలిగేది కాదు. బాబాను సశరీరులుగా దర్శించలేకపోయాననే అన్న బాధ కలచివేస్తుండేది. అందుకని సశరీరులైన అంతటి మహాత్ముల దర్శన భాగ్యాన్నైనా ప్రసాదించమని శ్రీసాయినాథుని ప్రార్థించారు. అప్పటినుంచి మహాత్ములు ఎక్కడ వున్నారో అన్వేషించి, ఎక్కడ వుంటే అక్కడకు పరుగులు తీసేవారు. అలా ఆయన ఎంతోమంది మహాత్ములను దర్శించారు. వారిలో శ్రీ ఆనందమాయి అమ్మ ఒకరు. శ్రీ ఆనందమాయి అమ్మ నైమిశారణ్యానికి వచ్చి వున్నారని, ఆమెను దర్శించదలచినవారు అక్కడకు వచ్చి అమ్మ దర్శనం చేసుకోవచ్చని వార్తాపత్రికలోని ప్రకటన చూసి అమ్మ దర్శనార్థమై వెళ్ళారు. అక్కడ అమ్మ సన్నిధిలో శ్రీ అఖండానంద సరస్వతి అను మహనీయుడు ప్రతిరోజూ భాగవత ప్రవచనం చేసేవారు. ఆయన తన ప్రవచనంలో ఒకసారి సమాధి చెందిన మహాత్ములు లౌకికమైన కోరికలు మాత్రమే తీర్చగలరని, ఆత్మసాక్షాత్కారం ప్రసాదించజాలరనీ చెప్పారు. అది విన్న పూజ్యశ్రీ మాస్టరుగారికి తాము గురువుగా తలుస్తున్న శ్రీ సాయిబాబా అటువంటి స్థితిని ప్రసాదించలేరా అన్న సందేహం కలిగింది. ఆయనకు సాయిబాబా వద్ద కలిగిన అనుభూతి ఆయన దర్శించిన ఇతర మహాత్ముల వద్ద కలగలేదు. మరి ఇంకెవరిని ఆశ్రయించాలి? అన్న సంశయంతోనూ, సందిగ్ధంలోనూ, ఆయన వుండగా ఒకసారి పూణేలో వున్న శ్రీ గుళవణి మహరాజ్ ను దర్శించడం జరిగింది. ఆయన దత్తోపాసకులైన శ్రీ వాసుదేవానంద సరస్వతీ స్వామి ముఖ్య శిష్యులు. ఆయన పూజ్యశ్రీ మాస్టరుగారిని చూస్తూనే, 'సాయిబాబా కా బేటా' అని ఆహ్వానించారు. ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి సమస్య విని, శ్రీ సాయి విషయంలో అట్టి సంశయం అవసరం లేదని, ఆయన సమాధి అనంతరం కూడా ఆత్మానుభూతిని ప్రసాదించగల సమర్థ సద్గురువనీ చెప్పారు. అంతేగాక పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆయన తమ గురువైన వాసుదేవానంద సరస్వతి స్వామి రచించిన 'శ్రీ గురుచరిత్ర' కూడా ప్రసాదించారు.

ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేశారు. అప్పుడొక రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారికి శ్రీ సాయి స్వప్న దర్శనమిచ్చి, "నీకు గురువు లభించలేదని బాధపడతావెందుకు? నేనున్నాను కదా!" అని మూడుసార్లు చెప్పారు. సమర్థ సద్గురువైన శ్రీసాయినాథుడు స్వప్నదర్శనమిచ్చి స్వయంగా ఆయన గురువు తామేనని స్పష్టంగా తెలియజేయడంతో పూజ్యశ్రీ మాస్టరుగారి ఆనందానికి అవధులులేవు! అప్పటి ఆయన స్థితి ఎలా వుందో మనం ఊహించడం కష్టమే! అప్పటి నుండి ఆయనకు శ్రీ సాయిబాబాను సశరీరులుగా దర్శించాలన్న కోరిక నశించింది. అంటే బాబా ఆయనకు శాంతి ఆనందాలను ప్రసాదించారన్నమాట!

"ఆ స్వప్నం తర్వాత మీ స్థితి ఎలా వుంది?" అని అడిగితే, "అప్పటినుంచి అంతులేని ఆనందం నా స్వంతమైంది. ఏ కోరికా నాలో మిగలలేదు. శాశ్వత ఆనందమే!!" అన్నారు. నిజమే! అది ఆయనలో స్పష్టంగా కనిపిస్తూనే వుండేది. ఎటువంటి పరిస్థితికీ ఆయన చలించడం ఎవరూ చూసివుండరు. నిరంతర ఆనందమే ఆయన. "అయితే ఈ విషయం ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదేమిటి?" అని అడిగినప్పుడు, "చెప్పడానికి ఏమున్నది? ఎవరితో చెప్పాలి? 'వేరు' అనిపిస్తే కదా!" అన్నారు. అలాగే ఒకసారి ఒకరు, "మీరు పొందవలసింది పొందారా?" అని ఆయనను ప్రశ్నించినప్పుడు ఆయన తమ హృదయంపై చేయి

పెట్టుకుని, "పొందాను!" అని స్పష్టంగా చెప్పారు.

"ఎవరు నా శిష్యులనేది? అటువంటి వాడు నాకు ఒక్కడు కూడా దొరకలేదు" అని శ్రీ సాయినాథుడు చెప్పారు. అటువంటి శ్రీ సాయినాథులే స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆయన గురువు తామేనని స్పష్టం చేశారంటే ఎట్టకేలకు శ్రీ సాయినాథునికి పూజ్యశ్రీ మాస్టరుగారు శిష్యులుగా లభించారన్నమాట!

ఒక జ్యోతి మరొక జ్యోతిని వెలిగించగలదు. అప్పుడు వెలిగింపబడిన జ్యోతి మొదటి జ్యోతికి ప్రతిరూపంగానే ప్రకాశిస్తుంది. అలాగే సద్గురువు శిష్యుణ్ణి తమంతటివానిగా చేస్తారని పెద్దలు చెబుతారు. సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని తమ ప్రతిరూపంగా చేసారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. పూజ్యశ్రీ మాస్టరుగారి చరిత్రలో ఇందుకు ఉదాహరణలు ఎన్నో వున్నాయి.

ఆయన సద్గురు సాయినాథుని వలెనే ఎన్నోలీలలు ప్రదర్శించారు. వారు చేసిన కొన్ని లీలలను ఇప్పుడు చెప్పుకుందాం.

ఒంగోలులో నివసిస్తున్న శ్రీమతి సరోజనమ్మగారికి ఐదుగురు ఆడపిల్లలు. ఇద్దరికి వివాహాలైనాయిగాని మిగతా ముగ్గురికీ పెళ్ళిళ్ళు అవడం కష్టమైంది. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు ఆమె వచ్చి తన ముగ్గురు ఆడపిల్లల వివాహాలు సమస్యగా వున్నాయని, వారికి ముప్పై సం॥లు పైబడ్డాయని, అందుకని ఆ విషయమై తనకు చాలా దిగులుగా వున్నదని బాధపడ్డారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెకు ధైర్యం చెబుతూ, "ఏమీ దిగులుపడకమ్మా! ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు త్వరలోనే వెంట వెంటనే అవుతాయి" అన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లే వెంట వెంటనే ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారు సర్వజ్ఞులైనప్పటికీ ఏ విషయమైనా - స్పష్టంగా చెప్పేవారు కాదు. సూచనగా మాత్రమే తెలియజేసేవారు.

ఒకసారి మల్లాది సీతారామయ్యగారు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర కూర్చుని వున్నారు. అప్పుడే చి॥వేదవతి, ద్వారకలు తమ స్నేహితుల ఇంటికి వెళతామని పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పారు. అది విని సీతారామయ్యగారు వాళ్ళను తన బండిపై తీసుకువెళ్ళి దింపి వస్తానని చెప్పారు. అప్పుడు మాస్టరుగారు, "నువ్వొద్దులే, నిన్ననే ప్రయాణం చేసి వచ్చావు రెస్ట్ తీసుకో!" అన్నారు. అందుకు ఆయన, "ఏం ఫర్వాలేదు సార్! దించి వస్తాను" అని మళ్ళీ అన్నారు. అప్పుడు కూడా మాస్టరుగారు, "వద్దు సీతారామయ్యా! పిల్లల్ని ఎవరో ఒకరు తీసుకువెళతారులే, నువ్వొద్దులే!" అని మళ్ళీ చెప్పారు. అయినా ఆయన ఏమీ ఫరవాలేదని చెప్పి పిల్లల్ని తన స్కూటరు మీద తీసుకువెళ్ళారు. పిల్లల్ని దింపి తిరిగి వస్తుండగా ఆయనకు యాక్సిడెంట్ (accident) అయింది. పూజ్యశ్రీ మాస్టరుగారు వెళ్ళవద్దని ఎందుకు చెప్పారో అప్పుడు వారికి అర్థమైంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు బాబావలెనే ఒక్కొక్కప్పుడు అపథ్యమైన ఆహారంతో వ్యాధులు తగ్గించేవారు. ఉచ్చులూరివారి పాలెంకు చెందిన బోడయ్య అనే అతను రక్త విరేచనాలతో బాధపడుతున్నాడు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ ఊరిలోని ఒకరింటికి సత్సంగానికి వెళ్ళారు. అప్పుడతడు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకున్నాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు అతనిని "బాగున్నావా?" అని అడిగారు అప్పుడతడు తనకు నెలరోజులుగా రక్త విరేచనాలు అవుతున్నాయని, ఏ మందులు వాడినా ఏమాత్రం తగ్గడం లేదని, చాలా బాధపడుతున్నాననీ విన్నవించుకున్నాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ వ్యాధికి ఒక అపథ్యమైన పదార్థం చెప్పి, దానిని తీసుకోమని, దానితో తగ్గిపోతుందనీ చెప్పారు. అతడలానే చేసాడు. చిత్రంగా అతని వ్యాధి తగ్గిపోయింది!

యస్. బాబువలీ పూజ్యశ్రీ మాస్టరుగారిని తరచుగా దర్శిస్తూ వుండేవాడు. ఒకసారి వారింటికి ఒక సాధువు వచ్చి అతనికి త్వరలోనే పెళ్ళి అవుతుందని, ఒక బిడ్డ పుడుతుందనీ చెప్పాడు. అలాగే అతనికి వివాహం అవడం, ఒక బిడ్డ జన్మించడం జరిగింది. బిడ్డ పుట్టిన 10వ రోజున ఆ సాధువు ఇతని ఎదురింటికి వచ్చి వీరింటిలో 'గులాబి' వున్నదని, పురిటింటికి తాను వెళ్ళననీ చెప్పి వెళ్ళాడు. తర్వాత ఆ బిడ్డకు 30వ రోజున పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు పాపను తీసుకువెళ్ళి ఆయనను పాపకు పేరుపెట్టమని అడిగారు. ఆయన పాపకు 'గులాబి' అని పేరు పెట్టారు. ఆ సాధువు చెప్పిన విషయం పూజ్యశ్రీ మాస్టరుగారికి ఎవ్వరూ చెప్పలేదు. అయినప్పటికీ ఆ పేరే ఆయన పెట్టడం వారికి ఆశ్చర్యం కలిగించింది. పూజ్యశ్రీ మాస్టరుగారు, ఆ సాధువు

ఒక్కరేనన్నమాట!

పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన ఒక్క మాటతో ఎంతటి సమస్య అయినా తీరవలసినదే. ఒకామెను భర్త వదిలేశాడు. ఆమె ఆయనతో కలిసి వుండడానికి ఎంతగానో ప్రయత్నించింది. కానీ 20సం॥లైనా ఆయన ఆమె ముఖం కూడా చూడలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి విని ఆమె ఆయన దర్శనం చేసుకుంది. అప్పుడు ఆమె మాస్టరుగారితో తన పరిస్థితిని వివరించి తనకు ఒక ఆడపిల్ల వున్నదని, ఆ పిల్లకు 20సం॥ల వయస్సు వచ్చింది, కనుక వివాహం చేయాలనుకుంటున్నానని, కాని తండ్రి లేకపోవడంతో ఎలా చేయాలో అర్థం కావడం లేదని, తన పరిస్థితి తెలిసి ఎవరు చేసుకుంటారో అని భయంగా వున్నదని, ఆ విషయమై తాను చాలా చింతిస్తున్నాననీ తన గోడు విన్నవించుకున్నది. అప్పుడు మాస్టరుగారు ఆమెతో, "ఏం ఫర్వాలేదమ్మా! నువ్వు 'శ్రీ సాయి లీలామృతం' పారాయణ చేస్తుండు. ఆయన తప్పక వస్తాడు. మీ అమ్మాయి పెళ్ళి చక్కగా జరుగుతుంది. బాబా వుండగా మనకేమి దిగులు?" అని అభయమిచ్చారు. తరువాత ఆమె శ్రీ సాయిలీలామృతం పారాయణ చేయడం ప్రారంభించింది. కొన్ని పారాయణలు అయ్యేటప్పటికి కలలో కూడా వస్తాడని భావించని ఆమె భర్త తిరిగి వచ్చాడు. వాళ్ళ అమ్మాయి పెళ్ళి ఘనంగా జరిగింది.

శ్రీ రామచంద్రరావు విద్యానగరు కాలేజీలో మాస్టరుగారి దగ్గర చదువుకున్న విద్యార్థి. మాస్టరుగారి దగ్గరకు తరచూ వస్తుండేవాడు. ఆ తర్వాత అతను తిరుపతిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నప్పుడు ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు తిరుపతికి స్పాట్ వాల్యుయేషనుకి వచ్చారు. అప్పుడు అతను మాస్టరుగారిని కలుసుకున్నాడు. వారిద్దరూ ఒకసారి ఒక హోటల్ పైనుంచి క్రిందకు దిగుతున్నారు. బయట పెద్ద వర్షం కురుస్తున్నది. వాళ్ళకు బయటకు వెళ్ళవలసిన పని వున్నది. రామచంద్రరావు, "ఇంత వర్షంలో ఎలా వెళతాం సార్!" అన్నాడు సందేహిస్తూ. అప్పుడు మాస్టరుగారు, "ఏం ఫర్వాలేదు, వర్షం ఆగిపోతుందిలే!" అన్నారు. అంతే! పైనుంచి మెట్లు దిగి వచ్చేసరికి చిత్రంగా వర్షం ఆగిపోయింది. ఒక్క చినుకు కూడా రాలడంలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు సమర్థులు. ప్రకృతిని కూడా వారు నియంత్రించగలరు!

రఘురామరాజు అనే అతను విద్యానగర్ కాలేజీలో మాస్టరుగారి స్టూడెంట్. అతడు మాస్టరుగారి పట్ల ప్రభావితుడై, మాస్టరుగారి దగ్గరకు సత్సంగాలకు వస్తుండేవాడు. అతనికి వున్న ఒక సమస్యను నివారించుకోడానికి అజీ బాబాగారనే సాధువు దగ్గరకు వెళ్ళాడు. ఆయన ఖురాన్ లోని ఒక మంత్రం చెప్పి దానిని 40 రోజులపాటు ఆయన దగ్గరవుండి ప్రతిరోజూ అర్ధరాత్రి 12గం॥లప్పుడు జపం చేయమన్నారు. అతడు అలాగే చేశాడు, కానీ ఫలితం లేకపోయింది. తరువాత మాస్టరుగారి దగ్గరకు వచ్చి జరిగిన విషయం చెప్పాడు. అప్పుడాయన, "ఆయన నీకిచ్చిన మంత్రం ఏమిటి?" అని అడిగారు. ఎవ్వరికీ చెప్పవద్దన్నారని అతడు చెప్పాడు. అప్పుడు మాస్టరుగారు, "నాకు కూడా చెప్పవద్దన్నారా?" అని అడిగారు. అతడు, "అవును సార్, ఎవరికీ చెప్పవద్దన్నారు" అని మళ్ళీ చెప్పాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఐతే చెప్పవద్దులే! అని, ఇంట్లో నుంచి ఒక పాత సిగరెట్ ప్యాకెట్ ను తెప్పించారు. అది అతనికిస్తూ, "ఇదేనా నీకు ఆయన యిచ్చిన మంత్రం?" అని చూపించారు. అది చూసి అతడు ఆశ్చర్యపోయాడు. కారణం అజీబ్ బాబా చెప్పిన మంత్రం సరిగ్గా అదే! పూజ్యశ్రీ మాస్టరుగారు సర్వజ్ఞులు. అతనికి అజీబాబా ఏ మంత్రాన్ని ఇవ్వబోయేది కూడా ఆయనకు తెలుసన్నమాట!

ఒక సాయి భక్తుడు వారింటికి సమీపంలోని ఒకరింటికి పూజ్యశ్రీ మాస్టరుగారు వస్తున్నారని తెలిసి అల్లరి చిల్లరగా, నాస్తికుడిగా తిరుగుతున్న తమ పిల్లవాడికి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేయించాలని తీసుకెళ్ళాడు. అప్పుడే ఆ ఇంట్లో వున్న చిన్న పిల్లవాడు జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం తీవ్రమవడంతో ఫిట్స్ కూడా రావడం మొదలయ్యాయి. ఆ పిల్లవాడిని వెంటనే ఆసుపత్రికి తీసుకెళదామనుకున్నారు. అది గ్రామం కావడంతో ఎంత ప్రయత్నించినా ఎలాంటి వాహనమూ లభించలేదు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ ఇంటి డాబామీద కూర్చొని ఎవరితోనో మాట్లాడుతున్నారు. ఏమి చేయాలో తెలియక అందరూ ఆందోళన పడుతుండగా ఒకాయన ఆ పిల్లవాడిని భుజంపై వేసుకుని పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు పరిగెత్తాడు. అప్పుడు అది చూసిన ఆ నాస్తిక యువకుడు, "డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళకుండా ఈయన

దగ్గరకు తీసుకెళితే ఈయనేం చేస్తాడు?" అని మనస్సులో అనుకున్నాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు, "పిల్లవాడికి ఏమైంది?" అని అడిగారు. విషయం చెప్పగానే, "ఏమీ భయంలేదు. బాబుకు ఏమీకాదు. గాలి తగిలేలా పడుకోబెట్టండి, చాలు" అంటూ కొద్ది విభూతి తీసుకొని ఆ బాబు నోట్లో వేసి, కొంచెం బొట్టు పెట్టారు. పూజ్యశ్రీ మాస్టరుగారిపై విశ్వాసంతో వాళ్ళు పిల్లవాడిని తీసుకెళ్ళి మంచంపై పడుకోబెట్టారు. 'ఈయన అంత కాన్ఫిడెంట్ గా (confident) చెబుతున్నారు, డాక్టరుకు చూపించకపోతే ఎట్లా?' అని ఇతనికి సందేహంగా వున్నది. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు కొద్ది నిమిషాలలో ఆ పిల్లవాడికి ఫిట్స్ ఆగిపోయాయి. మరునాడు ఉదయానికల్లా ఏ మందూ లేకుండానే జ్వరంకూడా పూర్తిగా తగ్గిపోయింది. ఇదంతా స్వయంగా చూచిన ఆ నాస్తిక యువకునికి పూజ్యశ్రీ మాస్టరుగారిపై విశ్వాసం కలిగింది. ఆ తరువాత అతడు పూజ్యశ్రీ మాస్టరుగారి భక్తుడు అయ్యాడనడంలో సందేహమేమున్నది?

నిడదవోలుకు చెందిన యస్.వి.యస్.యస్ సుబ్బారావు పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడలేదు. అయినప్పటికీ ఆయన గురించి విన్న అతడు వారి గ్రంథాలను పారాయణ చేస్తుండేవాడు. ఒకరోజు స్వప్నంలో అతనికి పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చారు. కలలోనే నిద్రపోతున్న అతనిని నిద్రలేపి తమతో రమ్మన్నారు. వారిద్దరూ విశాఖపట్నం వెళుతున్న రైలులో ప్రయాణం చేస్తుండగా ఒక స్టేషనులో అతనితోపాటు మాస్టరుగారు కూడా దిగి అక్కడికి కొంచెం దూరంలోవున్న ఒక దేవాలయాన్ని అతనికి చూపించి అక్కడ దేవుని దర్శనం చేసుకొని మూడు ప్రదక్షిణలు చేసుకొని రమ్మన్నారు. అతడు చేసి రాగానే, "ఆ స్వామి ఎవరో తెలుసా?" అని అడిగారు. అతడు తెలియదని చెప్పగానే ఆయన, "సింహాచలం అప్పన్న" అని చెప్పారు. అలా అతనికి స్వప్నంలోనే సింహాచలక్షేత్ర దర్శనం చేయించారు. అలాగే మరొకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలో కన్పించి అతనిని ఒక ప్రదేశానికి తీసుకెళ్ళారు. అక్కడ వున్న ఒక నది ఒడ్డుకు అతనిని తీసుకెళ్ళి, "ఇది ఏ నది?" అని అడిగారు. అతడు "నాకు తెలియదు" అన్నాడు. అప్పుడు, "బాగా ఆలోచించి చెప్పు" అన్నారాయన. అప్పుడు ఆలోచించి



"గంగానది" అన్నాడు. అప్పుడు మాస్టరుగారు అతనిని జుట్టుపట్టుకుని మూడుసార్లు నదిలో ముంచి పైకి తీశారు. వెంటనే అతనికి స్వప్నం ముగిసింది. ఆ తర్వాత అతడు ఒక సినిమాలో కాశీనగరాన్ని చూసి అనే తనకు మాస్టరుగారు దర్శింపజేసిన క్షేత్రం అని తెలుసుకున్నాడు.

శ్రీమతి విజయ పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వస్తుండేది. సాయిలీలామృతం ఆమె పారాయణ చేయాలనుకున్నది. కానీ చాలాకాలం ఆమెకు ఆ గ్రంథం కొనడానికి వీలుపడలేదు. ఒకరోజు రాత్రి ఆమె స్వప్నంలో ఒక దేవాలయంలో జరిగే శుభకార్యానికి వెళ్ళింది. అక్కడ వున్న కార్యనిర్వాహకులలో ఒకరు పూజ్యశ్రీ మాస్టరుగారి లాగానే వున్నారు. ఆయన కొన్ని పుస్తకాలను కట్టలు కట్టి ఎక్కడికో పంపుతున్నారు. దానిని చూస్తున్న ఆమెకు, 'పూజ్యశ్రీ మాస్టరుగారు ఇన్ని పుస్తకాలు ఎవరికో పంపుతున్నారు. కాని నా వద్ద ఒక్క పుస్తకం కూడా లేదే! నాకు ఒక పుస్తకమైనా యిస్తే బాగుండు!' అని బాధపడింది. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెవైపు చూసి, "ఏమిటలా చూస్తున్నావు? నీకు ఇవ్వలేదనా? వస్తాయిలే!" అంటూ తమ చేతిలో మిగిలిన ఒకే ఒక్క పుస్తకం ఆమెకు చూపిస్తూ, "ఇదిగో, ఈ ఒక్క పుస్తకం మిగిలింది, తీసుకో!" అంటూ

ఆమెకిచ్చారు. చిత్రంగా ఆ మరునాడే ఆమె స్నేహితుడు శ్రీ భరద్వాజ మాస్టరుగారు రచించిన 'శ్రీ సాయిలీలామృతం' గ్రంథాన్ని ఆమెకు బహుమతిగా యిచ్చాడు.

చీరాల వాస్తవ్యురాలు శ్రీమతి బందా ఆదిలక్ష్మి ఒకసారి మరికొంతమందితో కలిసి శిరిడీ వెళ్ళాలనుకున్నది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమెకు స్వప్నదర్శనమిచ్చి ఇప్పుడు శిరిడీ వెళ్ళవద్దని చెప్పారు. అప్పుడు ఆమె, "అదేమిటి మాస్టరుగారు, మేము ఎంతోకాలంనుండీ వెళ్ళాలనుకుంటూవుంటే ఇప్పటికి ముహూర్తం కుదిరింది. అయినా మేము శిరిడీ వెళుతున్నట్లు మీకెవరు చెప్పారు?" అన్నదామె. "నాకెవరు చెప్పాలి? మీ అందరి యోగక్షేమాలు చూసే బాధ్యత నాది గనుక నేనే చెబుతున్నాను" అన్నారాయన. అంతటితో ఆమె స్వప్నం ముగిసింది. శిరిడి వెళ్ళలేకపోతున్నందుకు బాధపడుతూనే పూజ్యశ్రీ మాస్టరుగారు ఎందుకలా చెప్పారోనని వారు ప్రయాణం మానుకున్నారు. సరిగ్గా ఆ మరుసటి రోజే మహారాష్ట్రలో పెద్ద భూకంపం వచ్చి కొన్ని వేలమంది మరణించారు! పూజ్యశ్రీ మాస్టరుగారు తమ భక్తుల బాధ్యత వహిస్తారు, యోగక్షేమాలు స్వయంగా చూసుకుంటారు.

ఏలూరు వాస్తవ్యుడు కృష్ణమోహన్ ఒకరోజు స్వప్నంలో శివాలయానికి వెళ్ళాడు. కాని జనసందడి ఎక్కువగా వుండడంతో దర్శనం చేసుకోలేకపోతున్నాడు. ఇంతలో ఆ దేవాలయంలో పనిచేసే ఒకతను కృష్ణమోహన్ చేయిపట్టుకుని వేరే దారిలో తీసుకెళ్ళి శివుని దర్శనం చేయించాడు. అక్కడ అతనికి శివలింగం బదులు పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చారు. తర్వాత కొన్నాళ్ళకు విజయవాడలోని భవానీపురంలో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్నదని తెలిసి అక్కడకు వెళ్ళాడు. కాని అక్కడ కూడా భక్తులు విపరీతంగావుండి అతనికి లోపలికి వెళ్ళే అవకాశమే రాలేదు. ఇంతలో ఒక సాయిభక్తుడు అతనిని లోపలికి పిలిచి మాస్టరుగారి విగ్రహం దగ్గరే కూర్చునే అవకాశం కల్పించాడు. ఆ విగ్రహాన్ని చూసిన అతనికి ఆశ్చర్యమేసింది. అతనికి కలలో శివునికి బదులుగా కనిపించిన స్వరూపమే అది!

దత్తపాదుకా శ్రీనివాసులు ఒకసారి బ్యాంక్ లోన్ (bank loan) కు అప్లై (apply) చేసాడు. అందరూ తెలిసిన వారైనప్పటికీ లోన్ (loan) రావడానికి ఎవ్వరూ సహాయం చేయలేదు. ఎంతకాలం గడచినప్పటికీ లోన్ శాంక్షన్ (loan sanction) కాలేదు. అతడు ఈ విషయమై 'శ్రీ సాయిలీలామృతము', 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేస్తుండగా ఒకరోజు స్వప్నంలో మాస్టరుగారు దర్శనమిచ్చారు. ఆయన బాబా గుడిలోంచి బయటకు వస్తున్నారు. "మాస్టరుగారు, ఏమిటిలా వచ్చారు?" అని ఇతను అడిగాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "బాగున్నావా? ఇంతకు నీకు లోన్ శాంక్షన్ చేసారా? సరే, నువ్వు రేపు బ్యాంక్ కి వెళ్ళి డబ్బులు తీసుకొచ్చుకో పో" అన్నారు. అప్పుడతడు, ""మాస్టరుగారు, వాళ్ళు నాకు లోన్ ఇవ్వకుండా తిప్పిస్తున్నారు" అన్నాడు. అందుకు మాస్టరుగారు, "లేదురా, నేను చెప్పాను. నువ్వు రేపు బ్యాంక్ కి వెళ్ళి డబ్బులు తెచ్చుకో, ఇస్తారు" అన్నారు. మరునాడు మాస్టరుగారు చెప్పారు కదా అని అతడు బ్యాంక్ కి వెళ్ళగానే వాళ్ళు చెక్ (cheque) తీసి చేతిలో పెట్టారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నిత్యసత్యులు.

డాక్టర్ నరసింహంగారి వదినగారి అబ్బాయి నెల్లూరులో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. అతనికి రోజూ హై ఫీవర్ వచ్చేది. మందులిస్తూ రోజూ రాత్రిపూట లాడ్జిలో సెలైన్ పెట్టేవారు. అతనికి మరునాడు ఉదయం బెనారెస్ లో పరీక్ష వుంది. వాళ్ళ నాన్నగారు పరీక్షకు వెళ్ళవద్దన్నా కూడా అతడు వెళ్ళాడు. డాక్టర్ నరసింహంగారు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్ళి, "మాస్టరుగారు! శ్రీనివాసుకి బాగోలేదు. ఈపాటికి వాడు పరీక్షకు వెళ్ళివుంటాడు. మీరు ఆశీర్వదించండి" అన్నారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నరసింహంగారి చేతిలో ఊదీ పెట్టి ఆ పిల్లవాడే పెట్టుకుంటున్నట్లు నరసింహంగారినే భావన చేస్తూ నోట్లో వేసుకోమన్నారు. ఆయన అలాగే చేసారు. ఆశ్చర్యం! పూజ్యశ్రీ మాస్టరుగారు ఊదీ పెట్టుకోమన్న క్షణంనుంచే అక్కడ బెనారెస్ లో పరీక్ష రాస్తున్న అతనికి జ్వరం తగ్గిపోయింది. ఆ తరువాత అతనికి జ్వరమే రాలేదు. అతనికి ఆ పరీక్షలో మంచి ర్యాంక్ వచ్చి యం.బి.బి.యస్ లో సీటుకూడా వచ్చింది.

యం.జనార్ధనశెట్టికి చాలాకాలం సంతానం కలుగలేదు. ఎన్నో ప్రయత్నాలు చేసారు. ఎందరో దేవుళ్ళకు మొక్కుకున్నారు. కానీ సంతానం కలుగలేదు. తెలిసిన వారొకరు పూజ్యశ్రీ మాస్టరుగారివద్దకు వెళ్ళమని, ఆయన ఈ సమస్యకు పరిష్కారం చెప్పగలరని చెప్పి అతని భార్యను

పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు తీసుకెళ్ళారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమె సమస్య విని బాబా చరిత్ర పారాయణ చేయమని చెప్పారు. అందుకామె, "ఎంతోమంది దేవుళ్ళని సేవించాను ఇప్పటికే. మాకింక విసుగు పుట్టింది" అన్నది. అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు, "అలా కాదమ్మా! శ్రీ సాయిబాబా చరిత్ర 7సార్లుగాని, 9సార్లుగాని ఖచ్చితంగా పారాయణ చేయాలి. మీ కోరిక నెరవేరకపోతే నా దగ్గర వున్న మహాత్ముల ఫోటోలన్నింటినీ అవతల పారేస్తాను" అని గట్టిగా చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు వారు పారాయణ చేసారు. వారికి సంతానం కలిగింది.

ఇన్ని లీలలు ఆయనవల్ల జరిగినప్పటికీ పూజ్యశ్రీ మాస్టరుగారు సాయిబాబాయొక్క శిష్యునిగానే ప్రవర్తించారు. తమ గురువు యొక్క గొప్పతనాన్ని ప్రపంచమంతటా చాటి చెప్పారు. అందుకై అహర్నిశలూ శ్రమించారు.

ఆయన తమ గొప్పతనాన్ని ఎన్నడూ అంగీకరించేవారుకాదు! "నాదేమున్నది? అంతా బాబా మహిమే!" అనేవారు. ఆయన తమను చూపిస్తూ, "ఇది మిఠాయి పొట్లమే! ఇందులో వున్నది మాత్రం సాయినాథుడే! ఆయనే లేకపోతే ఇది ఒట్టి కాగితమే కదా!" అనేవారు. ఆయనలో సాయినాథుడు వుండడమంటే సామాన్యమైన విషయమా? ఆయనలో పూర్తిగా అంటే నిండుగా సాయియే వున్నారన్నమాట! ఒకసారి ఆయనే యిలా చెప్పారు! "సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథుడు నన్నునుగ్రహించి నా హృదయంలో నిరంతరమూ స్థిరంగా నిలిచివున్నారు!

అంతేకాదు, శ్రీ సాయిబాబానే స్వయంగా పూజ్యశ్రీ మాస్టరుగారు – తామూ వేరుగాదని తెలియబరచిన లీలను ఇప్పుడు చెప్పుకుందాము.

అనంతపురానికి చెందిన కె. నారాయణమూర్తి 10సం॥లుగా పారాయణ చేస్తున్నాడు. తనకు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనభాగ్యం కలగాలనే కోరిక అతనికి ఎంతగానో వుండేది. ఒకరోజు అతనికి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చారు. తమ ఇంటి ముందునుంచి వెళ్తున్న పూజ్యశ్రీ మాస్టరుగారిని నారాయణమూర్తి తమ ఇంట్లోకి రమ్మని ఆహ్వానించాడు. ఆయనవచ్చి వారింట్లో పద్మాసనంలో కూర్చున్నారు. అతడు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలకు నమస్కారం చేసుకోగానే – ఆయన ఏమీ మాట్లాడకుండానే వెళ్ళిపోయారు. పూజ్యశ్రీ మాస్టరుగారు వెళ్ళిన వెంటనే శ్రీ సాయిబాబా వచ్చి అదే స్థానంలో కూర్చున్నారు. నారాయణమూర్తి బాబా పాదాలకు నమస్కరించి, "బాబా! ఇప్పుడు వచ్చారేమిటి? కొద్ది క్షణాలముందు వచ్చివుంటే మీ శిష్యుణ్ణి చూపించి వుండేవాడిని కదా!"అన్నాడు. వెంటనే సాయిబాబా తీక్షణంగా అతనివైపు చూచి, "వాడిని నీవు నాకు చూపించడమా? వాడే నేను – నేనే వాడు!" అంటూ అదృశ్యమయ్యారు. అంటే పూజ్యశ్రీ మాస్టరు గారు – సాయి బాబా ఒక్కరేనన్నమాట!

చివరిగా పూజ్యశ్రీ మాస్టరుగారి గూర్చిన మరొక అద్భుత సన్నివేశం చెప్పుకుందాము. ఒకసారి కొందరు విద్యార్థులతో కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడి వెళ్ళారు. అప్పుడు అక్కడకు శ్రీసాయి శరణానంద కూడా వచ్చివున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆయనను కలుసుకొని సంభాషించారు కూడా! తరువాత వారిలో ఒకరు శ్రీ సాయిశరణానందను కలుసుకొని "మీరు బాబాను ప్రత్యక్షంగా చూసారు కదా, ఆయన ఎలా వుండేవారు? ఆయన సంగతులు ఏమైనా చెప్పండి. తెలుసుకోవాలని వుంది" అని అడిగాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడలేరు. అప్పుడు శ్రీ సాయి శరణానంద మాట్లాడుతూ, "బాబావంటివారు ఎవరైనా కనిపిస్తారేమోనని అప్పటినుండి వెతుకుతున్నాను. కానీ ఒక్కరుకూడా కనిపించలేదు. అయితే చిట్టచివరకు ఒక్కరే ఒక్కరు దొరికారయ్యా! వారెవరో కాదు, మీ గురువుగారు భరద్వాజే! తలకు గుడ్డ చుడితే అచ్చు చిన్నప్పటి సాయిబాబాలాగానే వుంటాడు!" అన్నారు.

ఇంతకంటే పూజ్యశ్రీ మాస్టరుగారి గూర్చిన మహత్తర విషయం మరొక్కటి ఏమున్నది? అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారు సమర్థ సద్గురువు శ్రీ సాయినాథుడు వెలిగించిన జ్ఞాన దీపం! సాయి ప్రతిరూపం!!

సమర్థ సద్గురు శ్రీ సాయినాథుడు పూజ్యశ్రీ మాస్టరుగారిని తమ ప్రతిరూపంగా మలచిన ఫిబ్రవరి 9వ తేదీని పురస్కరించుకుని ఆయన లీలలను స్మరించుకుని ఆయన అనుగ్రహానికి పాత్రులమవుదాము. ●

మాతృదేవి స్మృతులు

శ్రీమతి నాగలక్ష్మి, పామూరు/ హైదరాబాదు

మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి తమ సమాధి అనంతరం కూడా భక్తులను అనుగ్రహిస్తున్నారు. హైదరాబాదు వాస్తవ్యురాలు, పామూరు సత్సంగ సభ్యురాలైన శ్రీమతి నాగలక్ష్మిగారు సమాధి అనంతరం పూజ్యశ్రీ అమ్మగారి లీలావైభవాన్ని ఈవిధంగా తెలియచేస్తున్నారు –

2021 డిసెంబర్ నెలలో కొంతమంది పామూరు సత్సంగ సభ్యులము మాతృదేవి సన్నిధికి సేవకు వచ్చాము. మాలో ఇద్దరు ప్రసాదాలు చేయడం, సర్దడము చేసేవారు. నేను సన్నిధి దగ్గర సేవలు చేసేదానిని. మేము వచ్చిన వారం రోజులకు సాయంత్రం కాఫీ నివేదనయ్యాక, నేను సమాధి పైన శుభ్రం చేసి, మెట్లు ఊడ్చి, క్రింద మిగిలిన ఖాళీ స్థలం చిమ్ముతున్నాను. ఒక్కసారిగా పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి మెట్ల దగ్గర కుర్చీలలో కూర్చుని చాలా స్పష్టంగా కనిపించారు. నాకు ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. కొంచెం భయం వేసింది. చీపురు కిందపడేసాను. పూజ్యశ్రీ అమ్మగారు చాలా సాదాసీదాగా వున్నారు. వాళ్లిద్దరే అని తెలిసినా తొట్రుపడుతూ, "మీరెవరు?" అనడిగాను. "భయపడకు, మేము నీ తల్లిదండ్రులం!" అని చెప్పారు. 'పూజ్యశ్రీ అమ్మగారు ఇలా వచ్చారా?!' అని ఆశ్చర్యపోతున్నాను. వెంటనే మాయమైపోయారు. నా ఆనందానికి, ఆశ్చర్యానికి అవధులు లేవు. వారి అనుగ్రహానికి పులకరిస్తూ రెట్టించిన ఉత్సాహంతోను, భక్తిశ్రద్ధలతోనూ సేవ కొనసాగించాను.

ఇంకొకరోజున ఉదయం కాఫీ ప్రసాదం తీసుకొని అందరూ వెళ్ళిపోయిన తరువాత నేను పూజ్యశ్రీ అమ్మగారికి పాదాలవైపున తల ఆనించి నమస్కారం చేసుకుంటున్నాను. ఎవరో చేయి నా తలమీద పెట్టి ఆశీర్వాదమిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చటుక్కున లేచి పక్కన ఎవరైనా వున్నారేమోనని చూశాను. ఎవరూ లేరు. పూజ్యశ్రీ అమ్మగారే నన్నలా ఆశీర్వదించి అనుగ్రహించారని అర్థమై పులకించాను.

నేను ఉదయం సన్నిధికి వచ్చిన దగ్గరనుంచి రాత్రి తిరిగి వెళ్లేవరకూ అక్కడే వుండేదాన్ని. మధ్యాహ్నం కూడా అక్కడే ఊరికే కూర్చోవడమో, పారాయణ చేసుకోవడమో చేసేదాన్ని. ఒకొక్కసారి ఎవరైనా దర్శనానికి వచ్చేవారు. లేకపోతే పక్షులు, జంతువులు లోపలకు వస్తాయేమోనని అక్కడే కూర్చునేదానిని.

ఒకసారి మధ్యాహ్నం సుమారు మూడు, నాలుగు గంటల మధ్య పూజ్యశ్రీ అమ్మగారి సమాధికి ఎదురుగా కూర్చుని పారాయణ చేసుకుంటున్నాను. పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి సమాధిలోనుంచి లేచి, సమాధి మధ్య భాగంలో రోడ్డువైపు తిరిగి – అంటే నాకు ఎదురుగా కూర్చుని ఐదు నిముషాలు దర్శనమిచ్చారు. నేను పారాయణ చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో పూజ్యశ్రీ అమ్మగారి వైపు చూడటం అలవాటు. అలా చూస్తున్నప్పుడు అకస్మాత్తుగా పూజ్యశ్రీ అమ్మగారు కూర్చుని కనిపించారు. సుమారు ఐదు నిముషాల తరవాత అదృశ్యమయ్యారు. పూజ్యశ్రీ అమ్మగారు నిత్యసత్యులై యిక్కడే వున్నారని స్పష్టమైంది.

నాకు చిన్నప్పటినుంచి సేవ చేయడం ఇష్టం. మేము పామూరులో వుంటాము. అక్కడ నారాయణగారి ఇంట్లో సత్సంగాలు చేసుకుంటాము. నా 9వ సంవత్సరం నుంచే నేను సేవకు వెళ్లేదాన్ని. అప్పుడు కూడా సత్సంగంలో పటంలోనుంచి బాబా చాలా స్పష్టంగా కనిపించేవారు. ఎక్కువగా స్వప్నాలలో బాబా, పూజ్యశ్రీ అమ్మగారు

మిగతా 26వ పేజీలో

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

12వ ప్రసంగము

దేవపూజ చేయకుండా మానవుల్ని పూజించే మానవులు

స్వా॥ప్ర॥ : ఒక హిందూ ఆచార్యులు, మహ్మదీయ గురువు వుండేవారు. వీరిద్దరూ స్నేహితులు. వీరిద్దరూ ఒకసారి స్వర్గానికి వెళ్ళి దేవదర్శనము చేసుకోవాలని అనుకున్నారు. అలాగే వారిద్దరూ స్వర్గానికి వెళ్లారు. దేవుడిని దర్శించడానికి ఒంటరిగా వెళ్లాలా లేకపోతే ఆచార్యులు, గురువులతో కలిసి దర్శనం చేసుకోవాలా అనే సందేహం వారికి కలిగింది. సాయంకాలం వరకు అక్కడే తిరుగాడుతూ వుండి, సంధ్యా సమయంలో ఒక దారి పక్కగా నిలబడ్డారు. ఆ మార్గంలో భగవంతుడు వస్తాడని అతని దర్శనం చేసుకోవచ్చని వారి వుద్దేశ్యం. ఆ మార్గంలో చాలా వాహనాలు వచ్చాయి. అందులో మొదటిది శంకరాచార్యులవారిది. వారు చేతిలో దండము ధరించి వున్నారు. వారి వెనక కోట్లాదిమంది సన్యాసులు ఇతరులు నడిచి వస్తూవున్నారు. మహ్మదీయ గురువు "వారెవరు?" అని అడిగాడు. "వారు శంకరాచార్యులు" అని ఆచార్యులు సమాధానం చెప్పారు. వారి వెనకనే రామానుజాచార్యులవారు వచ్చారు. వారిని అనుసరించి లక్షలమంది నిలువు నామాలు ధరించినవారైన త్రిదండి సన్యాసులు వారి సేవకుల లాగా వచ్చారు. వారి వెనుకనే వల్లభాచార్యులవారి వాహనం వచ్చింది. వారితో కూడా వేలాదిమంది శిష్యులు వున్నారు. ఆ తర్వాత గౌతమ బుద్ధుడు తన కోట్లమంది సేవకులతో వచ్చారు. వారి తరువాత లక్షలమంది సేవకులతో మహావీర స్వామి వచ్చారు. ఆ తర్వాత గుర్రం మీద మహ్మదీయ ప్రవక్త వాహనం వచ్చింది. అప్పుడు ఆచార్యులు ఆ మహ్మదీయ గురువును "ఆయన ఎవరు?" అని అడిగాడు. ఆ మహ్మదీయ గురువు "ఆయన మహ్మద్ ప్రవక్త" అని సమాధానం ఇచ్చాడు. వారి వెనకనే లక్షల కోట్ల సంఖ్యలో వారి అనుచరులు వచ్చారు. తర్వాత జరథుస్త్ర (జోరాస్టర్-ఇరానీ మతప్రవక్త) చేతిలో అగ్నిని ధరించి వచ్చారు. వారి వెంట వారి సేవకులు వేలకొలది వచ్చారు. అనంతరము ఏసుక్రీస్తు వచ్చారు. ఆయన వెంట ఆయన శిష్యుడొకరు సిలువ పట్టుకొని వస్తూవున్నాడు. ఆయనను కూడా కోట్లాదిమంది అనుసరించారు. వీరందరి తరువాత ఒక వృద్ధుడు చేతిలో కర్రతీసుకొని చిరిగిన లంగోటి కట్టుకొని నెమ్మది నెమ్మదిగా నడుస్తూ వస్తూవున్నారు. అతని వెనుకనే 10, 15 మంది మాత్రమే కనబడ్డారు. ఆచార్యులు "వీరెవరు?" అని అడిగారు. మహ్మదీయ గురువు "అల్లా" (దేవుడు) అని సమాధానం చెప్పాడు. ఆచార్యులు ఇలా అడిగారు: "ఆ మహానుభావుల వెనుక అంత అట్టహాసంతో కోట్లమంది మనుషులు వున్నారు కదా! అల్లామియా వెనుక

ఇంత తక్కువమంది వున్నారేమిటి?" అప్పుడు మహ్మదీయ గురువు జవాబు చెప్పాడు: "ఈ ప్రపంచంలో మానవపూజ ఎక్కువ. దైవపూజ తక్కువ. చాలామంది మనుషులను అనుసరించేవారే. దేవుడిని అనుసరించేవారు చాలా తక్కువ మంది వుంటారు".

అందువలన గురువులు మొ॥న వారిని ధ్యానించేవారు ఈరోజులలో ఎక్కువ మంది వున్నారు. భగవంతుని వేదాలలో చెప్పబడిన విధంగా వుపాసించేవారు చాలా తక్కువ మంది.

డా॥లల్లు : మా మిత్రులు నన్ను వారి గుంపులో కలుపుకోవడానికి ఎంతగానో ప్రయత్నించారు. కానీ నేను మాత్రం వెళ్లలేదు.

గుడ్డి నమ్మకపు సంప్రదాయము

స్వా॥ని॥ : ఒక రాజధానిలో ఒక గురువు, వారికి ఐదారుగురు శిష్యులు వుండేవారు. వారేదో చెడ్డ పనికి పాల్పడ్డారు. కాబట్టి అక్కడి రాజు వారందరినీ ముక్కులు కోసి అవమానించి రాజ్యము నుంచి తరిమేశాడు. వారు అక్కడి నుండి బయలుదేరి మరొక రాజ్యానికి చేరారు. వారందరూ శాస్త్రాలను అభ్యసించి వున్నారు. సంగీతము మొదలైన వాటిల్లో ప్రావీణ్యము కూడా వారికి ఎక్కువగానే వున్నది. వారు హరికథ చెప్పి, తరువాత తబలా మొదలైన వాద్యాలతో భజన చేసేవారు. అందరి ముక్కులు కోసి వున్నాయి కదా. ప్రజలు "మీ ముక్కులు ఎందుకు కోయబడి వున్నాయి?" అని అడిగారు. వారి గురువు ఇలా చెప్పాడు: "భగవంతుని దర్శనానికి ముక్కు అడ్డము. కాబట్టి దానిని కోసేసి దీక్ష తీసుకున్నాము".

ప్రజలు గుడ్డి నమ్మకము కలవారు. కాబట్టి వారందరూ భగవద్దర్శనం కోసం ముక్కులు కోయించుకొని దీక్ష తీసుకున్నారు. అలా వారు **'ముక్కిడి'** సంప్రదాయంలో చేరారు. ఇలా రెండు మూడు సంవత్సరాలు జరిగేసరికి 'ముక్కిడి' సాంప్రదాయంలోని శిష్యుల సంఖ్య కొన్ని వేలకు చేరింది. వీరందరూ ఇతరులకు ఇలా బోధించేవారు. "ఓహో ముక్కులు కోయించుకున్న తర్వాత వారికి దైవదర్శనమైంది చూశారా! మేము నిరంతరము ప్రభు దర్శనభాగ్యాన్ని కలిగివున్నాము. ఇటువంటి మహాభాగ్యం ఎవరికి కలుగుతుందో వారే మాలాగా దైవదర్శనము పొందగలరు". ఇలా వర్ణించి వర్ణించి తమలాగానే ఇతరులను కూడా చేసి వారిని తమలో కలుపుకునేవారు. ఇది అందరికీ తెలిసి అక్కడి రాజు కూడా వారి దర్శనానికి వెళ్లాలనుకున్నాడు. ఆయనకు దైవదర్శనము చేయాలని కోరిక కలిగి గురువును దీక్ష యిమ్మని కోరాడు. ఆ సంగతి ఆయన తాతగారి సమకాలీనుడైన 90 సంవత్సరముల వయస్సు గల పూర్వపు దివానుకు తెలిసింది. వెంటనే అతడు రాజు దగ్గరకు వచ్చి ఇలా అడిగాడు–

"మీరు దీక్ష తీసుకోవడానికి వెళ్తున్నారని విన్నాను నిజమేనా?"

రాజు : పరమాత్మ దర్శనమవుతున్నప్పుడు దీక్ష తీసుకోవడంలో విశేషమేమున్నది?

దివాను : వంశపారంపర్యంగా నేను మీకు రుణపడి వున్నాను. మిమ్మల్ని రక్షించడం నా ధర్మము. మీ వయస్సు చాలా తక్కువ. ప్రపంచంలో ముక్కు వుండడం చాలా అవసరము. ముక్కు లేని వాడు మనిషే కాదు. పైగా తమరు రాజుగారు. మీ వయస్సు తక్కువ. మిమ్మల్ని ఈ దీక్ష తీసుకోవద్దని నేను చెప్పను. నాకు 90 సంవత్సరములు నిండాయి. నా జీవితము ఇంకా కొన్ని నెలలు మాత్రమే మిగిలి వున్నది. ముందు నేను దీక్ష తీసుకొని నాకు దైవదర్శనమైతే మీరు దీక్ష తీసుకోవచ్చు.

ఇలా చెప్పి అతడు హారాలను మొదలైన వాటిని కానుకలుగా తీసుకువెళ్లి గురువును దీక్ష ఇమ్మని ప్రార్థించాడు. ఇంత పెద్ద చేప తన వలలో చిక్కుకున్నదని ఆశ్చర్యపడి గురువు 'సరే' అన్నాడు. దీక్ష ఇచ్చే రోజును నిశ్చయించాడు. దివాను ఇంటికి వెళ్లి సైన్యాధిపతిని పిలిచి ఇలా చెప్పాడు : "నీవు 25, 30 మంది సైనికులను వెంటబెట్టుకొని వచ్చి మఠానికి చుట్టుపక్కల రహస్యంగా వుండు. నేను ఆజ్ఞాపించగానే వారందరినీ హత్య చేయి".

ఇలా చెప్పి మర్నాడు దీక్ష తీసుకోవడానికి కానుకలు, పూజాసామాగ్రి తీసుకొని గురువు దగ్గరకు వెళ్ళాడు. దీక్షనిచ్చే సమయంలో ఎదుట గురువు కూర్చుని వున్నాడు. ఇద్దరు మనుషులు దివాను చేతులు పట్టుకున్నారు. మూడోవాడు ముక్కు కోశాడు. దీక్ష ఇచ్చిన తర్వాత గురువు దివానుతో ఇలా అన్నాడు : "ఇప్పుడు నాకు భగవంతుడి దర్శనమైందని చెప్పు".

దివాను "నాకు భగవంతుడు కనిపించడం లేదు"

గురువు : ముక్కు తెగిన తర్వాత దేవుడు కనిపించాడని చెప్పాలి కదా?

ఇది విని దివాను ఇలా అన్నాడు "అలాగా

ఇంతమంది ముక్కులు ఆ విధంగానే కోసి జనాలని వశపరుచుకున్నావా?" అని చెప్పి బయటకు వచ్చాడు వెంటనే దాక్కుని వున్న సైనికులను ఆజ్ఞాపించాడు ఆ సైనికులు ఈ వంచకులను అందరిని చంపేశారు.

ఈ విధంగా చూచిన నీవు బుద్ధిమంతుడవి కనుక ఆ ముక్కిడి సాంప్రదాయంలో కలవలేదన్నమాట. ఈ రోజులలో ప్రజలు ఆలోచించకుండా ఒకరిని చూచి మరొకరు నేర్చుకుంటున్నారు. పంచతంత్రంలో ఇలా వున్నది.

శ్లో॥ ఏకస్య కర్మ సంవీక్ష్య
కరోత్యన్యోఽపి గర్హితమ్ ।
గతాను గతికో లోకో
న లోకః పారమార్థికః ॥

భావం: ఒకడు తప్పుడు పనులు చేయడం చూచి మరొకడు వాడిని అనుకరిస్తాడు. ఇలా ఆలోచించకుండా అనుకరిస్తాడేగాని పరమార్థాన్ని గుర్తించేవాడే లేడు.

డా॥లల్లు : అయితే పరమాత్మను ఎలా ధ్యానించాలి?

స్వా॥ప్ర॥ : ఏకాంతంలో తెలుసుకోవచ్చు.

స్వా॥ని॥ : ఇక్కడ చెప్పినా ఏమీ తప్పులేదు. ఇక్కడ సత్సంగ సభ్యులు తప్ప మరెవరూ లేరు. పైగా మేఘదృష్టి {మేఘాలకు (మేఘునికి) ఎలా అంతా సమానమో అలా!} కలిగి వుండాలి. ఉప్పు పట్టిన భూమిలో నీరు ఉప్పగా వుంటాయి. తియ్యనిచోట నీరు తీయగా వుంటుంది. అలానే అధికారి గ్రహిస్తాడు. కానివాడు గ్రహించలేడు. మేఘునికి అందరూ సమానమే!

పరమాత్మ ధ్యానానికి అవసరమైన సాధనాసంపత్తి

స్వా॥ప్ర॥ : భగవద్గీతలో ఇలా చెప్పబడివున్నది—

శ్లో॥ వివిక్త సేవీ లఘ్వాశీ
యతవాక్కాయమానసః ।
ధ్యానయోగపరో నిత్యం
వైరాగ్యం సముపాశ్రితః ॥

భావం : ఏకాంతంలో దేవుని సేవిస్తూ, తక్కువ భోజనం చేస్తూ, మనస్సును, వాక్కును, శరీరాన్ని జయించి వైరాగ్యవంతుడై ధ్యానయోగ నిమగ్నుడైన మానవుడు బ్రహ్మసాక్షాత్కారము పొందడానికి సమర్థుడు.

వివిక్త సేవీ : ధ్యానయోగి ఏకాంతంలో వుండి ధ్యానం చేస్తున్నంత కాలం దానికి విఘ్నాన్ని కలిగించే బాహ్యమైన కారణాలు వుండకూడదు. విద్యుచ్ఛక్తి మొదలైన విషయాల మీద విజ్ఞానశాస్త్రంలో పరిశోధనలు చేసేవారు కూడా ఏకాంతంగానే పరిశోధనలు చేస్తారు. ఏకాంతం లేకపోతే చిత్తవృత్తి ఏకాగ్రత పొందదు.

'ఎడిసన్' అనే విజ్ఞాన శాస్త్రవేత్త విద్యుచ్ఛక్తి పరిశోధనలను అతడు ఏకాంతంగా ఏకాగ్రత చిత్తంతో చేసేవాడు. నౌకరులు భోజనం తీసుకునివస్తే తన ఏకాగ్రతకు భంగం కలుగుతుందేమోనని, "అక్కడే పెట్టి వెళ్ళు. నేను తర్వాత తింటాను" అని చెప్పేవాడు. తాను తన పరిశోధనలలోనే మునిగివుండేవాడు.

కొన్ని గంటల తరువాత నౌకర్లు ఖాళీ గిన్నెలను తీసుకువెళ్లడానికి వచ్చేవారు. అప్పటికి ఇంకా భోజనము అలానే వుండేది. ఆయన ఆ విధంగా అన్నపానీయాలు మరిచిపోయి తన పరిశోధనలోనే మునిగి వుండేవాడు. విజ్ఞానము ఆత్మవిద్య కంటే స్థూలమైనది. దానికే అంత ఏకాగ్రత అవసరమైనప్పుడు ఇక ఆధ్యాత్మ విద్యకు ఎంత ఏకాగ్రత కావాలి?

మానవుల సంసర్గమేలేని పవిత్రమైన అడవులు, పర్వత గుహలు, తీర్థాలు, దేవాలయాలు మొదలైనవి ఏకాంత ప్రదేశాలు. ఈ విషయంలో వేదం ఇలా చెబుతుంది:

శ్లో॥ సమేశుచౌ శర్కరావహ్ని
వాలుకావివర్జితే, శబ్ద జలాశయాదిభిః ।
మనోఽనుకూలే న తు చక్షుః పీడనే
గుహానివాతాశ్రయణే ప్రయోజయేత్ ॥

భావం : సమము, పవిత్రము అయినది; రాళ్లు, నిప్పు, ఇసుక లేనిది; కలకల ధ్వని చేసే జలాశయాలతో మనోహరమైనది, కళ్ళను బాధించు (ఆకర్షించే) వస్తువులే లేనిది, గాలి వలన బాధ లేనిది అయిన గుహలో చిత్తాన్ని బ్రహ్మముతో కలపాలి.

దుర్గంధము లేనిది, కోలాహలము లేనిది, జన సంపర్కానికి దూరంగా వుండేది, ఎగుడుదిగుడులు లేనిది,

పవిత్రమైనది అయిన ఏకాంత స్థలంలో కూర్చుని ధ్యానం చేయాలి. వృత్తిని బ్రహ్మముతో కలపాలి.

వివిక్తదేశే చ సుఖాసనస్థ ఏవ శుచిః సమగ్రీవ శిరశ్శరీరః 1

భావం : ఏకాంత స్థలములో సుఖాసనంలో కూర్చుని, పవిత్రుడై, కంఠము, శిరస్సు, శరీరము సమానంగా వుంచి ధ్యానించాలి.

భగవద్గీత ఆరవ అధ్యాయంలో ఏకాంతంలో ధ్యానయోగము చేయమని చెప్పబడ్డది. ఇంట్లోనే వుంటూ చిత్తాన్ని ఏకాగ్రము చేయడం అసంభవము. కాబట్టే పూర్వకాలంలో వ్యాసుడు మొ॥న మహర్షులు స్త్రీ, పుత్ర, ధనాదులను విడిచి అరణ్యంలోకి వెళ్లి ఏకాంతంగా కూర్చుని ధ్యానము చేసేవారు. 13వ అధ్యాయంలో 'అరతిర్జనసంసది' అని చెప్పబడినది. 'జనసంపర్కం పట్ల ప్రీతి వుండకూడదు' అని కూడా చెప్పబడినది. కొందరు అసురసంపద కల దుర్మార్గుల సంసర్గము కూడదనీ, దైవసంపద కల సజ్జన సంసర్గానికి ఏమీ అభ్యంతరము లేదని చెబుతుంటారు. కానీ వాస్తవంగా ధ్యానయోగికి ఎదుటి వ్యక్తి సజ్జనుడా, దుర్జనుడా అనే భేదము లేదు. సజ్జనునితో జరిగిన సంభాషణ ద్వారా పరిచయం పెరిగి ప్రపంచంలో కీర్తి వస్తుంది. ఈ ప్రవృత్తి ధ్యానమనే వృత్తికి అడ్డంకి.

వ్యాస భగవానుడు శుకుడితో ఇలా చెప్పాడు :

శ్లో॥ అదర్శనమస్పర్శః
తథాఽసంభాషణం సదా 1
యస్యభూతైః సహ మునే
స శ్రేయోవిన్దతే పరమ్ 11

భావం : ఓ మునీ! మానవుల దృష్టికి దూరంగా వుండాలి. ఎవరిని ముట్టుకోకూడదు. ఎవరితోనూ మాట్లాడకూడదు. అట్టివానికి ఎంతో శుభం కలుగుతుంది.

లఘ్వాశీ : ఆహారము అల్పంగా తీసుకోవాలి. సోమరితనము, నిద్ర రానంత తక్కువ ఆహారం తీసుకోవాలి. అసలే ఆహారం తీసుకోవద్దని ఉద్దేశం కాదు. మితమైన ఆహారం తీసుకోవాలి. భగవద్గీత ఆరవ అధ్యాయము 16వ శ్లోకంలో ఇలా వున్నది—

'నాఽత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాన్తమనశ్నతః 1'

భావం : ఎక్కువ తినేవాడికి, పూర్తిగా ఆకలితో వుండే వాడికి యోగము కుదరదు.

'అత్యాహారమనాహారం నిత్యం యోగి వివర్జయేత్ 1'
అని శృతి.

భావం : యోగి ఎల్లప్పుడూ అత్యాహారాన్ని నిరాహారాన్ని కూడా విడిచి వేయాలి మితాహారిగా వుండాలి.

ధ్యానయోగాన్ని ఆచరించే యోగి ఆశ లేనివాడు, అపరిగ్రహం (ఎవరి వద్ద ఏమీ ఉచితంగా తీసుకోనివాడు) పాటించేవాడు అయి వుండాలి అని భగవద్గీత ఆరవ అధ్యాయంలో వున్నది.

ధనము మొదలైన అన్ని విధాలైన మాయాపదార్థాల పట్ల ఆశ లేనివాడై యోగము చేయాలి.

ఈ విషయంలో దత్తాత్రేయులవారు పింగళ అను వేశ్య వద్ద ఉపదేశాన్ని స్వీకరించిన దృష్టాంతము శ్రీమద్భాగవతంలో వున్నది.

విదేహనగరంలో పింగళ అనే వేశ్య వుండేది. ఆమె తన వృత్తితో చాలా ధనాన్ని సంపాదిస్తూ వుండేది. ఒక రాత్రి ఆమె విటుని కోసం చాలా పొద్దుపోయే వరకు ఎదురు చూసింది. గుమ్మము దగ్గర చాలా రాత్రి గడిచిపోయింది రాజమార్గంలో జనాల రాకపోకలు తగ్గిపోయాయి. కానీ విటుడు ఎవ్వరూ రాలేదు. చివరకు ఆమెకు తన నీచమైన వృత్తి పట్ల విరక్తి కలిగింది. ధనాశ వలన ఆత్మ అనే (కోరికలన్నింటినీ తీర్చే) భర్తను సేవించనేలేదు. ఎముకలు, మాంసము వున్న ప్రియుడిని (విటులను) సేవిస్తూ రోజులన్నీ గడిచిపోయాయి – అని ఆమె మనసులో ఎంతో బాధపడింది. ఆరోజు నుంచి ఆమె జీవితాంతము ఆ నీచమైన వృత్తిని వదిలి వేయాలని నిర్ణయించుకున్నది. ఇలా ఆమెకు తీవ్రమైన వైరాగ్యము కలిగి ఆమె ఆశలన్నింటిని విడిచి సుఖాన్ని పొందింది.

శ్లో॥ ఆశా హి పరమం దుఃఖం
నైరాశ్యం పరమం సుఖమ్ 1
యథా సంఛిద్య కాన్తాఽఽశాం
సుఖం సుష్వాప పింగళా 11

భావం : ఏదైనా పదార్థం కావాలని కోరిక కలిగి వుండటం చాలా పెద్ద దుఃఖము. ఆశను జయించడం గొప్ప సుఖము. పింగళ ప్రియుడి పట్ల ఆశను వదిలివేసింది. కాబట్టి ఆమె సుఖంగా నిద్రించింది – అని భాగవతంలో చెప్పబడివుంది.

- సశేషం

భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

మన పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి సోదరియైన శ్రీమతి శ్రీదేవిగారి చేత విరచితమైన భగవాన్ శ్రీ భరద్వాజ గ్రంథము పూజ్య భరద్వాజ గురుదేవుల చరిత్రని విస్తారముగా మనకి అందిస్తుంది. శ్రీమతి శ్రీదేవిగారికి శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ ఆశ్రమంలో వున్నప్పటి నుండి భరద్వాజ గురుదేవులతో పరిచయము వున్నది. పూజ్య గురు దంపతుల కళ్యాణము అనంతరము శ్రీమతి శ్రీదేవిగారు యెక్కువ కాలము పూజ్యశ్రీ అమ్మగారి వద్దనే వుండటం వలన, పూజ్యశ్రీ మాస్టరుగారి బోధనలను, జీవిత గమనాన్ని ప్రత్యక్షంగా గమనించి అనేక కోణాలలో వారి యొక్క చరిత్రను మనకు అందిస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు బ్రహ్మానుభూతి పొందిన ఈ ఫిబ్రవరి నెల నుండి ఈ పవిత్ర గ్రంథాన్ని మన సాయిబాబా మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము

— ఎడిటర్

ఒక్కమాట!

సాక్షాత్తు భగవంతుని ప్రతిరూపమే ఆయన పుణ్య చరితం. ఆ దివ్య చరితామృతాన్ని పానం చేయబోయేముందు–

అందరికీ అందని పుణ్యప్రదమైన యీ దివ్యచరిత్ర భగవంతుడు కరుణించి మనకు అందించిన మహాప్రసాదమనే విషయాన్ని ఎన్నటికీ మరువని స్ఫురణతో, గ్రంథం ఆమూలాగ్రం క్షణం కూడా ఏమరని భక్తి శ్రద్ధలతో, సంపూర్ణమైన ఏకాగ్రచిత్తంతో పారాయణ చేసి, మనలోని భక్తి, జ్ఞాన, వైరాగ్యములను జాగృతం చేసుకొని ముక్తిపథగాములమై చరించే శక్తి సామర్థ్యాలను ప్రసాదించమని ప్రార్థిస్తూ శ్రీ భరద్వాజ భగవానుని దివ్య చరణారవిందములకు భక్తితో ప్రణమిల్లుదాం.

మన దేశం

ధర్మాచరణకు ప్రతిరూపమైన శ్రీరామచంద్రుడు పుట్టిన యీ భూమి– విశ్వరూప సందర్శనమిచ్చి, సకల చరాచర సృష్టి జాలము, తన స్వరూపమేనని చాటి చెప్పిన గీతాచార్యుడు నడయాడిన యీ నేల– ఆత్మజ్ఞాన సంపదనంతా తన అణువణువునా నిక్షిప్తం చేసుకున్న యీ భరతావని – దైవం మానవ రూపంలో అవతరించి చరించటానికి ప్రధాన వేదికయై, నాటికి, నేటికీ, తన విలక్షణతను చూపుతూనే వుంది. తన విశిష్టతను చాటుతునే వుంది.

ప్రాక్పశ్చిమ దేశాలను అనుసంధానిస్తూ – చికాగో నగరాన్ని ఉర్రూతలూపిన వివేకానందుని బోధలకు, మతాలకతీతమైన మరో ప్రపంచాన్ని ప్రవచించిన శిరిడీ సాయినాథుని గాధలకు, మరెందరో మహనీయులు వెదజల్లిన ఆధ్యాత్మిక సౌరభాలకు ఆకర్షితులై ప్రపంచంలోని నలుచెరగులనుండి అసంఖ్యాక ప్రజలు ఆత్మానుభూతి నాశించి ఏ పవిత్ర భూమివైపు పరుగులు తీశారో ఆ భారతదేశపు అసమాన ఘనతను ఎంతగా పొగడినా అది అసంపూర్ణమే అవుతుంది.

ఇటువంటి మహిమాన్వితమైన, మహోన్నతమైన మన

మాతృభూమికి ముందుగా శిరస్సు వంచి నమస్కరిద్దాం.

ఆనాటి భరతావని...

అది 20వ శతాబ్దపు పూర్వార్ధం. వందలాది సంవత్సరాలు పరాయి పాలనలో వ్రుగ్గి అన్ని రంగాలలో అణచివేతకు గురైన భారత ప్రజల అసహనం హద్దులు దాటి, తిరుగుబాటు తీవ్రస్థాయిని చేరుకున్న సమయమది. ప్రజల ఆగ్రహం నుండి ఆవిర్భవించిన సమరోత్సాహం అనేకమంది మహామహుల సారధ్యంలో స్వాతంత్రోద్యమంగా పరిణమించి, రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య సౌధాలను కుప్ప కూల్చేందుకు సన్నద్ధమైంది. పునాదులు కదలిపోయిన తమ రాచరికపు భవంతుల క్రింద తామే సమాధి కాబోతున్న ప్రమాదం గుర్తించిన బ్రిటీష్ నిరంకుశ నియంతలకు తమను తాము రక్షించుకొనేందుకై దేశం విడిచి పోవటం ఒక్కటే మార్గంగా తోచింది.

మరోవైపు యావద్భారతావనినీ కలకాలం తమ కాళ్ళక్రింద నిలబెట్టుకోవాలంటే దేశానికి ఆయువుపట్టు అయిన సనాతన ధర్మాన్ని, యిచటి ప్రజల ఆధ్యాత్మిక పిపాసనీ దెబ్బతీయటమే సులభతరమైన మార్గంగా భావించిన ఆ బ్రిటీష్ కుటిల రాజనీతిజ్ఞులు మన పురాణేతిహాసాలన్నీ కట్టుకథలుగా, తుదకు శ్రీ కృష్ణుడు ప్రవచించిన భగవద్గీత సైతం కల్పితగాధగా పేర్కొంటూ, హిందూమత సంప్రదాయాలన్నింటినీ కించపరుస్తూ, వికటమైన నాస్తిక, హేతువాద భావనలను యువతరంలో ప్రేరేపిస్తూ, మన భారత తపోభూమిలో మహోన్నతంగా ప్రజ్వరిల్లే ఆధ్యాత్మిక హోమగుండాన్ని ఆర్పివేసేందుకు శాయశక్తులా కృషి చేశారు. తత్ఫలితంగా మసకబారిన ఆధ్యాత్మిక జ్యోతుల్ని మరల ప్రజ్వరిల్లజేసేందులకై శ్రీ దత్తాత్రేయునికి భారత భూమిపై మరల అవతరించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ భగవత్సంకల్పమే - శ్రీ రమణమహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ శిరిడీసాయి వంటి అనేక రూపాలలో దిగి వచ్చిన ఆ మహనీయుని అవతార ఘట్టాలలో శ్రీ భరద్వాజ మాస్టర్ ఆవిర్భావంగా మరొక క్రొత్త పేజీని ఆవిష్కరించింది.

ఆ మహనీయుడు ఎవరో కాదు....

అతడు ఒక మహాశక్తి! అనంతకోటి బ్రహ్మాండాలు, నక్షత్ర గ్రహగోళాలు దాటి భూమండలంపై ఆధ్యాత్మికతను వెల్లువెత్తించ వీచిన ఓ ప్రభంజనం! విశ్వపు వినువీధుల్లో నిలచి అజ్ఞానపు మత్తులో నిదురిస్తున్న మానవజాతిని మేల్కొలుప పూరించిన ఒక మహాశంఖారావం!

వసివాడిన జనబాహుళ్య వనాన్ని దైవీ సంపదతో పరిప్లావితం చేయ వర్షించిన కరుణామృత కలశం!

మస్తిష్కాలను కలుషితం చేస్తూ, పెడదారికి మళ్ళిస్తూ ముంచెత్తిన నాస్తిక, హేతువాద వెల్లువకు పెను సవాలుగా ఎదురు నిలచి, తన బోధనలతో, వాదనలతో అజ్ఞానపు ముంపుకు గురికాకుండా జాతిని కాపాడుకొన్న ధీరుడు, శూరుడు అతడు!

భగవాన్ శ్రీ భరద్వాజ



మత మౌఢ్యపు మంటలు మింటికెగసి లోకాన్ని మసి చేయబోయిన తరుణంలో సామరస్యతను చిలుకరించి మతాలకతీతమైన మరో ప్రపంచాన్ని ప్రవచించిన దివ్య ప్రబోధకుడు!

కోటి సూర్య ప్రభాభాసితమైన ఆత్మజ్ఞానపు వైభవం ముందు మానవ జీవిత ప్రాభవాన్ని పాతాళానికి దిగజార్చే ఆధునిక, ఆటవిక విన్యాసాలు వెలవెలబోయే మిణుగురు మెఋపుల్లాంటివని చాటి చెప్పిన నవయుగ వైతాళికుడు!

ఆధ్యాత్మికతనూ, ఆధునికతనూ కలబోసి, వేదవేదాంగ వైశిష్ట్యాలను నేటి విజ్ఞానానికి అన్వయించి, మోక్షమే మానవజాతికి ఎలా లక్ష్యమో విప్పిచెప్పి, అందర్నీ ఆశ్చర్యంలో ముంచి విశ్వమానవ విశ్వాసాన్ని చూరగొన్న వినూత్న విజ్ఞాన సాగరుడు!

అతడొక విలక్షణ లక్ష్యం!

సామాన్యులకు అర్థం కాని పరమార్థం!

సృష్టిని బ్రోవ ఏతెంచి వచ్చిన దివ్య

తేజఃపుంజం! విశ్వజనీనతను విశదపరచిన వేదాంతసారం!

ఎక్కిరాల భరద్వాజ గా పిలువబడుతూ, సాయి మాస్టర్ గా కొలువబడుతూ, మన మధ్య కొలువుదీరిన అపర దత్తాత్రేయుడే అతడు.

దిక్కులు పిక్కటిల్లేలా మ్రోగి, యావజ్జాతినీ ఉలికిపడి మేలుకొనేలా చేసిన అతని శిరిడీ సాయిబాబా లీలాకథా ప్రచార ఘంటారావం విశ్వమంతటా ప్రతిధ్వనిస్తోంది. ప్రజావళిని ఉత్తేజపరుస్తూ భక్తితత్పరతలో ముంచెత్తుతున్నది.

+++

తాము అపారంగా ప్రేమించిన ఓ పసిబిడ్డ శాశ్వత వియోగం దావానలమై తమను దహించిన వేళ...

ఆ దావానలంలో కరగిన హృదయం ఆగని కన్నీరుగా ప్రవించినవేళ......

ఆ కన్నీటిలో నిలువెల్లా క్షాళితమై, ఆ నిర్వేదంలో సర్వం మరచి తామొక శూన్యంగా మిగిలిపోయిన వేళ.......

సేదదీర్చి ఓదార్చిన శిరిడీ సాయిబాబా ఒడి.... పరిపూర్ణమైన ప్రేమకు ప్రతిరూపమైన ఆ గుడి..... ఎన్నటికీ ఎడబాయని ప్రేమంటే ఏమిటో తెలియజెప్పింది శ్రీ భరద్వాజ మాస్టర్ కు!!!

ప్రేమ! ప్రేమ! ప్రేమ!

స్వార్థంలోంచి పుట్టి త్యాగిని చేస్తుంది.

అనురాగంలో పుట్టి విరాగినిగా చేస్తుంది.

రక్తిలో ఉద్భవించి విరక్తునిగా మారుస్తుంది.

బంధమై నిర్బంధించి భవబంధాలనుండి విముక్తుని చేసి మోక్షదాయకమై నిలుస్తుంది.

అనంతకోటి కిరణాలను విరజిమ్మే సూర్యబింబంలాగ, అనంతానంత గుణ సమ్మేళనమై, విశ్వాన్ని సృజించి, పాలించి, లయింపజేస్తున్నదే ప్రేమ! సాయినాథుని ప్రేమను చవిచూచి, తామే ఒక ప్రేమస్వరూపులుగా మారిపోయిన శ్రీ భరద్వాజ మాస్టర్ నవనవోన్మేషితమైన ప్రేమ పుష్పాలతో దోసిలి నింపుకొని సృష్టిని అభిషేకించారు. గతంలోని తమలాగ పరితపిస్తున్న బాధాతప్త హృదయులకు బాసటగా నిలచారు!

శ్రీ భరద్వాజ మాస్టరుగారి జీవితాన్ని ఆమూలాగ్రం దృష్టి సారిస్తే, ఆయనలోని భగవతత్త్వమైన ప్రేమతత్త్వంలో నిండిన సర్వ సద్గుణ సంపన్నతను వివిధ కోణాలలో మన అవగాహనకు అందినంతమేర అవలోకించగలం!

శ్రీ భరద్వాజ మాస్టర్ అంటే ఏమిటి?

బంగారు రంగు శరీరచ్ఛాయలో 5 అడుగుల శరీరం, చక్కని అవయవ సౌష్టవం, అందమైన కోలముఖంలో అతి నిశితమైన, ప్రశాంతమైన దృక్కుల్ని ప్రసరింపజేసే అత్యంత ప్రకాశవంతమైన కన్నులు!

బాహ్య చక్షువులకు కన్పించే యీ రూపం వెనుక ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మే తేజోవంతమైన అంతః స్వరూప దీప్తులు! అవి ఆర్తులను, శరణాగతులను ఓదార్చే మార్గ దర్శక దీపికలు!

1963 సం॥లో శిరిడీ సాయిబాబా అనుగ్రహం చవిచూచిన తర్వాత శ్రీ భరద్వాజ మాస్టర్ సాయినాథుని ప్రతిరూపాలైన అనేకమంది మహాత్ములను దర్శించి, వారి ఆశీస్సులు పొందారు. తల్లి, తండ్రి, గురువు, దైవం తమ సర్వస్వమైన సాయిని సర్వత్రా దర్శించటంలో సర్వం మరిచారు. బంధుమిత్రులను, యితర జీవితావసరాలను, సకల వ్యాపకాలను, త్యజించి సాయి కోసమే జీవించారు.

ప్రాణప్రదమైన కన్నతండ్రి - పాదాక్రాంతమైన I.A.S. వంటి ఉన్నత పదవులు, కావాలనుకొంటే కాసుల వర్షం కురిపించగల మేధాసంపద, అందమైన రూపంతో యువకులైన తమనుకోరే అప్సరసల్లాంటి కన్యలు, కళ్ళ ఎదుట వున్న సకల వైభోగాలు, సాయినాథుని ప్రేమకు సరిసాటి కాలేకపోయాయి- శ్రీ భరద్వాజ మాస్టర్ కు!

తమ గురువైన శ్రీ శిరిడీ సాయిబాబాకు దాసులైన శ్రీ భరద్వాజ మాస్టర్, తమను చేరిన ఆర్తులను, ఆ అభయప్రదాతను ఆశ్రయించేలా చేయటానికి అహరహం శ్రమించారు. ఆ కర్తవ్యనిష్ఠలో ఆకలిదప్పులు మరచారు. గురుతరమైన ఆ బాధ్యతా నిర్వహణలో కర్పూరంవలె కరిగిపోయారు. ఆ కర్పూర సుగంధ పరిమళాలలో విశ్వవ్యాప్తుడై ఆర్తుల బాధలను, వేదనలను బాపుతూ, నిస్తేజమైన జాతిని మోక్షమార్గ సిద్ధికై ఉత్తేజపరుస్తూ, ఆ తేజోమూర్తి, ఆ ఆశ్రితవత్సలుడు, ఆ దయాంతరంగుడు, కరుణకు నెలవై, మనందరి గుండెల గుడిలో దైవంగా కొలువై నెలకొనియున్నారు.

- సశేషం

(గత సంచిక తరువాయి)

శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

అమ్మ అదే ఊరిలో వుంటున్న మున్సిఫ్ గా పనిచేస్తున్న జ్ఞానబాబు అనే భక్తుని యింటికి ఒక అమావాస్య దినాన వెళ్ళటం జరిగింది. జ్ఞానబాబు తన యింటిలో అమ్మను పూజించి అన్నసంతర్పణ కార్యక్రమం కూడా యేర్పాటు చేశాడు. అమ్మ అక్కడి వారందరినీ ఆశీర్వదించి తిరిగి వచ్చారు. అక్కడినుండి తిరిగి వస్తూనే అనూహ్యంగా అమ్మ వైఖరి మారిపోయింది. అమ్మ తన కుడిచేతిని రెండవ చేతితో నలుపుకుంటూ నవ్వుతూ, "ఈ చేయి పీకి పారేస్తాను" అని అంటుంటే యెవరికి యేమీ అర్థం కాలేదు. అమ్మ నవ్వుతూ మాట్లాడినా ఆమె కళ్ళల్లో నీళ్లు తిరగసాగాయి. పక్కనే వున్న గురుప్రియ కంగారుగా అమ్మకు యేమైందా అని చూస్తుండగానే అమ్మ తన చేతిని మరింత గట్టిగా లాగివేసుకొనసాగారు. నిజంగానే అమ్మ తన చేతిని పీకి వేసుకుంటుందేమోనని భయపడ్డ గురుప్రియ అమ్మ రెండు చేతులు నిమురసాగింది. ఆ రాత్రి, మర్నాడు కూడా అదే పరిస్థితి. బాధతో మాటిమాటికి చేయి నలుపుకుంటూనే వున్నారు అమ్మ. తర్వాత రోజు జ్యోతిష్ దాదా నుండి వుత్తరం వచ్చింది. అదే అమావాస్యనాడు దొంగలు రమణాశ్రమంలోని కాళీమాత విగ్రహం కుడిచేయి విరగగొట్టి నగలు యెత్తుకెళ్లారని ఆ వుత్తరం ద్వారా తెలుసుకున్న భక్తులకు అమ్మ చర్యలకు అర్థం తెలిసి ఆశ్చర్యపోయారు. సకల దేవతా విగ్రహాలలోను అమ్మయే ప్రతిష్ఠితులై వున్నారని అనటానికి ప్రత్యక్ష నిదర్శనమే యీ చర్య అన్న విషయం అందరికీ అవగతం అయింది.

కాక్సు బజారులో వుండగా మరొక సంఘటన జరిగింది. కాశీ నుండి కుంజమోహన ముఖోపాధ్యాయ గారి నాల్గవ కుమారుడు నానిబాబు కాక్స్ బజారు వచ్చాడు. అతనితో అమ్మ గాయత్రి మంత్రం జపించవలసినదిగా చెప్పారు. నానిబాబు ఒక గదిలో పద్మాసనములో కూర్చుని గాయత్రీ మంత్రం జపించసాగాడు. ఆ సమయంలో అతడు వున్నట్లుండి ఒక విచిత్రమైన స్థితికి లోనైనాడు. జపం నిర్విరామంగా జరిగిపోతున్నది. కనుల వెంట నీరు కారుతుండగా శరీరమంతా రోమాంచితమైంది. జపం ఆగకుండా జరిగిపోతున్నది. అతని స్థితిని చూసిన భక్తులు భయపడి కంగారుగా అమ్మతో చెప్పారు. అమ్మ అతని గదికి వచ్చి అతని యెదురుగా అతనినే చూస్తూ నిలుచున్నారు. అతడు వెంటనే కళ్ళు తెరిచి లేచి ఒక పరుగున వెళ్లి అమ్మకు సాష్టాంగ ప్రణామం చేశాడు. అమ్మ అతనిని ఆశీర్వదించారు. అయితే రెండు మూడు రోజులు అతను అన్యమనస్కంగా ఒక అలౌకిక స్థితిలో వున్నట్లు కనిపించాడు. భోజనం చేయటానికి, కనీసం సరిగా నిలబడడానికి కూడా శక్తి లేనంత నీరసం అతనిని ఆవహించింది. ఒకనాటి రాత్రి అమ్మ అతనిని తన గదిలోకి పిలిచారు. కొంతసేపు యేకాంతంలో అమ్మ అతనితో యేమి చెప్పారో, యేమి చేశారో తెలియదు కానీ ఆ మరునాటి నుండి అతడు మామూలు స్థితికి వచ్చాడు. అతడు సాధనలో ఒక వుత్తమ స్థితి పొందటం వలన అతనిలో యిటువంటి మార్పు సంభవించిందని అమ్మ అన్నారు.

కాక్స్ బజారు పర్యటన తర్వాత అమ్మ ఆదినాథ్, ఛటగావ్ అనే ప్రదేశాలు పర్యటించి అటునుండి ఢాకా వచ్చారు.

అమ్మ దక్షిణదేశ యాత్ర పర్యటనకు బయలుదేరే కొన్ని నెలలకు ముందుగానే ఢాకాలో కూడా ఒక ఆశ్రమం నిర్మించాలని అనుకున్నారు.

అమ్మ యాత్ర ముగించుకుని తిరిగి వచ్చే సమయానికి స్థల సేకరణ పూర్తి అయి నిర్మాణ పనులు ఆరంభించారు. నగేంద్రబాబు అనే భక్తుని పర్యవేక్షణలో పనులన్నీ జరుగుతున్నాయి. ఆ సమయంలో అతడు పునాదులు త్రవ్విస్తున్నప్పుడు భూమి లోపల యెన్నో సమాధులు కనిపించాయి. ఈ భూమి యెంతో పవిత్రమైనదని అమ్మ చెప్పారు. ఒక సమాధి లోపల మానవ శరీర యెముకలు వున్నాయి. దాని ప్రక్కనే వున్న సమాధిపై శివలింగం ప్రతిష్టింపబడి వున్నది. మరొక సమాధిపై కొన్ని మట్టి పాత్రలలో భస్మం, కొన్ని మట్టి ప్రమిదలు కనిపించాయి. ఆశ్రమ నిర్మాణం జరిగేటప్పుడు శివలింగం ప్రతిష్టింపబడిన సమాధి పైననే శివాలయం నిర్మించారు. ఆ ప్రక్కనే వున్న మూడు సమాధుల పైన కాళీ మందిరం నిర్మితమైంది. అమ్మ కుటీరం క్రింద కూడా ఒక సమాధి వున్నది. అది 'జ్యోతిష్ దాదా గత జన్మ సమాధి' అని అమ్మ అన్నారు. అమ్మ "ఈ ప్రదేశం అంతా సమాధిస్థులై గొప్ప మహాత్ములు కొలువైవున్నారు. యిది యెంతో పవిత్రమైన ఆశ్రమం" అన్నారు.

ఢాకా ఆశ్రమం పూర్తి అవగానే అమ్మ అక్కడే వుండసాగారు. ప్రాతఃకాలాన సమీప మైదానంలో కొంతసేపు అటూ యిటూ నడిచేవారు. సాయంసమయాలలో కొందరు భక్తురాండ్రు కూడా అమ్మతో కలిసి నడిచేవారు. ఢాకా ఆశ్రమంలో అమ్మ కొన్ని నెలలు వున్నారు.

కలకత్తాలో నివసించే రాయ్ బహద్దూర్ అనే భక్తుడు యెంతో కాలంగా అమ్మను దర్శిస్తుండేవాడు. ఆయన ప్రత్యేకత యేమిటో గాని, ఆయన ప్రస్తావన వచ్చినప్పుడు అమ్మ ఆయన గురించి "ఆయన యెంతో స్వచ్ఛమైన వ్యక్తి. ఆయన మనసులో యెటువంటి కల్మషం వుండదు. నిర్మల హృదయుడు" అనేవారు.

ఒకసారి ఆయన తన మనసులో తనను వేధిస్తున్న బాధను అమ్మతో యిలా చెప్పుకున్నాడు, "అమ్మా! నా ఆధ్యాత్మిక సాధన గురించి నాకెంతో ఆందోళనగా వుంటుంది. తీవ్రసాధన చేయనిదే లక్ష్యాన్ని యెట్లా చేరగలుగుతాము? కానీ నేను అలా చేయలేకపోతున్నాను.నా చిన్నతనంలో మా బంధువు ఒకాయన మా కుటుంబంతో యెంతో సన్నిహితంగా వుండేవాడు. అతడు గొప్ప దైవభక్తుడు. కాలం గడిచిన కొద్దీ అతని దైవభక్తి తీవ్రతరమైంది. రాత్రింబగళ్లు దైవధ్యానంలో గడుపుతుండేవాడు. అలా నిరంతరం దైవాన్ని స్మరిస్తూ స్మరిస్తూ చివరకు సన్యాసి అయ్యాడు. సర్వసంగపరిత్యాగిగా మారిపోయాడు. నేను చూడండి యీ విధంగా యెక్కడ వున్నవాడిని అక్కడే వుండిపోయాను" అంటూ జలజలా కన్నీరు కార్చాడు.

మరొక సందర్భంలో అతడు తన జీవితంలో జరిగిన ఒక అద్భుతమైన దైవలీల గురించి అమ్మతో యిలా చెప్పాడు, "అమ్మా! నేను చదువుకునే రోజులలో ఒకసారి స్నేహితులం కొందరము సరదాగా కొంతసేపు సమీపంలోని అడవిలో తిరిగి వద్దామని బయలుదేరాము. అలా తిరుగుతూ తిరుగుతూ దారి తప్పిపోయాము. ముందుకు పోయే కొద్దీ అడవి మరీ దట్టంగా చీకటిగా మహావృక్షాలు, పొదలతో నిండి యెటు నడవటానికీ సరిగా దారి కనిపించని పరిస్థితి యెదురయింది. ఆ పరిస్థితిలో మాకు యేమి చేయాలో అక్కడినుండి యెట్లా బయటపడాలో దిక్కుతోచక భగవంతుడిని ప్రార్థించడం మొదలుపెట్టాము. యింతలో ఆశ్చర్యంగా యెటునుండి వచ్చాడో తెలియదుగాని ఒక 12 సంవత్సరముల పిల్లవాడు మా వైపుగా వస్తూ కనిపించాడు. మా పరిస్థితిని తెలుసుకొని ఆ పిల్లవాడు తన వెంట రమ్మని చెప్పి మాకు దారి చూపిస్తూ మమ్మల్ని అడవి దాటించి ఊరి బాటకు చేర్చాడు. యెలాగైతేనే ఆ పిల్లవాడి దయవలన ఆపదనుండి బయటపడినందుకు సంతోషిస్తూ అంతటి సహాయం చేసిన ఆ పిల్లవానికి కృతజ్ఞతగా కొంత డబ్బు యిద్దామని అనుకుంటుండగానే మా కళ్ళముందే అతడు అదృశ్యుడైపోయాడు. మేమందరం దిగ్భ్రాంతి చెందాము. అతడు యెవరు? దేవుడే మమ్ము కాపాడేందుకు వచ్చాడా? వేల సంవత్సరాలు తపస్సు చేసే ఋషులకే ఆయన దర్శనం దుర్లభం అంటారే, మరి యే తపస్సు చేయని మాకు యెలా ప్రత్యక్షమైనాడు? ఆ విధంగా మాకు దారి చూపించి అంతలోనే మాయమైపోయాడే! ఈ చర్యకు అర్థమేమిటి? అనుకుంటూ యిళ్లకు చేరాము. ఆ విధంగా ఆ బాలుని రూపంలో దేముడు మమ్మల్ని ఆదుకొనక పోయినట్లయితే ఆ అడవిలో మా గతి యేమయ్యేది? యే క్రూరమృగాల పాలైపోయేవాళ్ళమో, యేమైపోయే వాళ్ళమో తెలియదు".

- సశేషం

సమాధి లీల

శ్రీ డబ్ల్యు.రామకృష్ణ

(నిరుద్యోగిగా వున్న సమయంలో మాస్టరుగారి సన్నిధిని పొంది బాబా సేవలో తరిస్తున్న సాయిబాబా మందిర పూజారి.)

నాకు ఉద్యోగం రాకముందు రోజూ సాయిబాబా మందిరంలో హారతులకు హాజరయ్యేవాడిని. హారతులు బాగా అలవాటయిన తర్వాత నేనే మందిరంలో బాబాకి హారతులిచ్చేవాడిని. అప్పటికింకా పెద్ద ఫోటో రాలేదు. రోజూ చిన్న ఫోటోకు హారతులు ఇచ్చేవాళ్ళం. మొట్టమొదటిసారి భరద్వాజ మాస్టరుగారిని నేను ద్వారకామాయి మందిరంలో ఉదయ హారతికి వచ్చినప్పుడు సాయిలీలామృతంలో వున్న ఆయన ఫోటో చూసి గుర్తుపట్టాను. మొదటిసారి ఆయనను చూసినప్పుడు భక్తి, భయం కలిగాయి. దానితో వణుకు వచ్చింది. బాబాకి హారతి ఇవ్వడానికి భయపడ్డాను. ఆటోమాటిక్ గా రాను రాను టోన్ తగ్గించాను. 15నిమిషాల తర్వాత మళ్ళీ బాగానే పాడాను. మాస్టారుగారు "బాగుందయ్యా! బాగానే పాడావు" అన్నారు. మొదట్లో ఒక వారం పదిరోజులు మాస్టరుగారు మార్నింగ్-వాక్ కి వచ్చి ఉదయ హారతికి వచ్చేవారు. అప్పట్లో రెగ్యులర్ గా ఒక బ్యాచ్ వచ్చేవారు. వారంతా హారతి బాగానే పాడేవారు. తర్వాత తర్వాత జనం రావడం ఎక్కువైంది. సత్సంగాలు, శ్రీ బాబా ప్రచారం బాగా జరిగేవి. అందువల్ల ఎక్కడెక్కడ్నించో భక్తులు బాగా రావటం మొదలు పెట్టారు. సద్గోష్ఠిని ఏర్పాటు చేశారు. మాస్టారుగారు ప్రసంగం చెప్పుకుంటూ వెళ్తారు. మధ్యలోనే ఎవరికైనా అనుమానం వస్తే అడగవచ్చు. మాస్టరుగారు సమాధానం చెప్తారు. ఇదీ ఆ సద్గోష్ఠి ప్రోగ్రామ్. నేను ఒకసారి మాస్టరుగారిని విడిగా వున్నప్పుడు ఒక ప్రశ్న వేశాను. "ధ్యానంలో కూర్చుంటే నిద్ర వస్తున్నదండి. ఏం చేయాలి?" అన్నాను. అప్పుడు సద్గోష్ఠి, రోజు మార్చి రోజు జరిగేది. సాయంత్రం 7-30 నుంచి 8-30 వరకు. అందుకు ఆయన, "ఇప్పుడు కాదు సద్గోష్ఠిలో వెయ్యి నీ ప్రశ్న. అప్పుడైతే నలుగురికి తెలుస్తుంది" అన్నారు. ఆరోజు సద్గోష్ఠి జరిగింది. మాస్టరుగారు డౌట్స్ అడగమంటే ఎవరూ అడిగేవారు లేరు. "ఎవరన్నా ప్రశ్న వేయండి సమాధానం చెప్తాను" అన్నారు మాస్టరుగారు. భక్తి వల్లనో, భయం వల్లనో ఎవరూ ప్రశ్న వేసేవారు కాదు. నేను లేచి నా ప్రశ్న వేశాను. "ధ్యానంలో కూర్చుంటే నిద్ర వస్తుంది. ఎలాగా ఏం చేయాలి" అని. దానికి ఆయన "నిద్ర ఎంతసేపు వస్తుందో అంత సేపు నిద్రపోయి, అప్పుడు ధ్యానానికి కూర్చో, అప్పుడు నీకు ధ్యానం మీద ఏకాగ్రత కుదురుతుంది" అన్నారు. గురుపూర్ణిమ, శ్రీరామనవమి మొదలైన పండగ రోజులలో ఆయన బాబాకి షోడశోపచార పూజ చేసేవారు. సద్గోష్ఠులని, ప్రసంగాలని, సత్సంగాలని, బాబా ప్రచారం బాగా చేసేవారు. ఒకసారి ఆయన "బాబా చెప్పిన 56 సూక్తులలో ఏ ఒక్క సూక్తినైనా త్రికరణ శుద్ధిగా ఆచరించ గలిగితే ఇంక బాబాగారితో మనకు పని లేదు"

అని భక్తులతో చెప్తుంటే విన్నాను. మరొక సారి "నువ్వు చూస్తూవుండు. అవసరమైనదంతా నేను చేస్తాను - అన్న సూక్తిపై తీరిక వుంటే 40 రోజులు చెప్పవచ్చు, చెప్తాను" అన్నారు. కాని ఆ అవకాశం బాబా ఇవ్వలేదు మనకు. మాస్టరుగారు రాను రాను చాలా బిజీగా వుండేవారు. ఒకవైపు సత్సంగాలు, ప్రసంగాలు. (ఈ వూళ్ళోను ఇతర వూళ్ళలోను) మరోవైపు రచనా వ్యాసంగం, షిర్డి యాత్రలు, భక్తులను కలుసుకోవడం ఇలా ఎన్నో కార్యక్రమాలలో బిజీ అయ్యారు. ఎక్కడెక్కడ్నుంచో జనాలు వస్తూండేవారు. బుక్స్ కొనుక్కుని మాస్టరుగారి ఆశీర్వాదానికై అడిగేవారు. వారిని తీసికెళ్ళాల్సి వచ్చేది. ఆయన టైమ్ ని వృధా చేయటం ఇష్టముండేది కాదు నాకు. ముందుగా "ఇలా రావాల్సి వస్తున్నది సార్ ఆశీర్వాదానికై" అంటే, "ఎప్పుడైనా రా రామకృష్ణ" అనేవారు. నేను ఒకటి, రెండు నిమిషాల కంటే ఎక్కువ వుండేవాణ్ణి కాదు. మాస్టరుగారు బాబా విగ్రహానికి కావాల్సిన పాలరాయి సెలక్షన్ కోసం జైపూర్ వెళ్ళారు. విగ్రహం చేసేవారు 5000 తగ్గించారు. అవి ట్రక్ ట్రాన్స్పోర్టుకి సరిపోయింది. వస్తూ, వస్తూ అజ్మీర్ వెళ్ళారు. వెళ్ళి వచ్చిన తర్వాత ఉపన్యాస కార్యక్రమం పెట్టారు.

ఒకరోజు అక్కల్ కోట సంస్థానం నుంచి చోళప్ప ముని మనుమడు 5వ తరం వాడు, చాల పెద్దాయన స్వామి పాదుకలను తీసుకొచ్చారు. ఆ మర్నాడు మందిరంలో స్వామి పాదుకలు వచ్చాయని ఎనౌన్స్ చేశారు. భక్తుల దర్శనార్థమై వాటిని మంగళవారం మందిరంలో వుంచుతారు, వచ్చి దర్శించుకోవచ్చు అని. మంగళవారం రాత్రి బాబా మందిరంలో సద్గోష్ఠి వుంది. చాలా మంది జనాలు వచ్చి వున్నారు. కాని ఎంతకూ మాస్టరుగారు రాలేదు. సుబ్బలక్ష్మి గారు వచ్చి మాస్టరుగారికి వంట్లో బాగుండలేదు, జ్వరం వచ్చింది అని చెప్పారు. అలా చెప్తే అందరూ వెళ్ళి మాస్టరుగారిని డిస్టర్బ్ చేస్తారని మాస్టరుగారు చాలా బిజీగా వున్నారు. ఏదో వ్రాసుకుంటున్నారు అందువల్ల ఈ రోజు రారు అని చెప్పి జనాలందరిని పంపించాం. ఆ మర్నాడు హారతి అయిన తర్వాత హారతికి వచ్చిన వారిని కొంతమందిని తీసుకుని మాస్టరుగారింటికి వెళ్ళాము. పాదుకలు ముందు గదిలో వున్నాయి. హాలులో అప్పటికే అక్కడ హారతికై కావాల్సిన పూజా సామాగ్రి అంతా రెడీగా వున్నది. నేను హారతిచ్చి లోపలికి తీసుకెళ్ళాను. మాస్టారుగారు పడుకుని వున్నారు. అమ్మగారు "ఏమండి రామకృష్ణ వచ్చాడు" అని చెప్తే, అప్పుడు లేచి హారతి కళ్ళకు అద్దుకున్నారు. తీర్థం, ప్రసాదం ఇచ్చాను. అప్పుడు పాదుకలను తీసుకు రమ్మన్నారు. వాటిని చేతులలోకి భక్తి పూర్వకంగా తీసుకుని మొహానికి గట్టిగా అదుముకున్నారు. "శ్రీరామనవమి ప్రోగ్రామ్స్ ఎలా చేయాలి సార్?" అని అడిగాను. "కావాల్సిన వారు పాదుకల్ని తీసుకెళ్తారు. శ్రీరామ నవమి ఉదయానికి మనకు చేర్తాయి" అని మాస్టరుగారు చెప్పారు. ఆ తర్వాత మేము పాదుకల్ని తీసుకుని భజన చేసుకుంటూ వచ్చేసాము. 7-15 లేక 7-30 అయివుంటుంది. టైమ్ నాకదే చివరి దర్శనం. ఆ తర్వాత ఆయన ఇంకెవరికీ దర్శనం ఇవ్వలేదు. నేను మందిరంలో బాబాకి అభిషేకం చేస్తున్నాను. ఇంతలో పాదుకలు తెచ్చిన ముసలాయన ధన ధనమని పరుగెత్తుతూ ద్వారకామాయిలో పడ్డారు. అటు ఇటు పొర్లి, పొర్లి ఏడ్చారు. "బాబా మర్ గయా" అని ఏడుస్తూ చెప్తున్నారు. ఆయన భాష మాకర్థం గాదు. ఈ లోపల పెద్ద ప్రసాద్ గారు వచ్చారు. ఆయనకు హిందీ తెలుసు, ఆయనడిగితే ఆ ముసలాయన హిందీలో చెప్పారు "మాస్టరుగారు నిర్యాణం చెందినట్టు". నేను స్టన్ అయిపోయాను. ఇప్పుడే కదా ఆయన నాతో మాట్లాడారు. ఇంతలోనే అలా జరిగింది అంటే ఎవరు మాత్రం నమ్మగలరు. ఇంతలో ఇద్దరు, ముగ్గురు కుర్రాళ్ళు సైకిల్స్ మీద వెళ్తూ చెప్పారు. "నిజమే సార్ మాస్టరుగారు శరీరం వదిలేశారు" అని. నేను ఇంటి కెళ్ళాను. ఈ లోపల కమిటీ మెంబర్స్ అందరికీ తెలియపర్చారు. ముందుగా ఏ కార్యక్రమం చేయాలో ఎవరికి పాలు పోవటం లేదు. మల్లికార్జున శాస్త్రిగారి తమ్ముడు "నాకు తల్లిదండ్రులు లేరు. నేను దీపం పెడ్తాను" అని మాస్టరుగారి తల దగ్గర దీపం పెట్టాడు. నేనేమో వచ్చిన జనాల్ని కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాను. కాని నా వల్ల కాలేదు. అదొక జన ప్రవాహం. ఒకటింపావుకు ప్రాంతీయ వార్తలలో మాస్టరుగారి నిర్యాణ వార్త వచ్చింది. ఆ రోజు ఎంత మందో స్పాట్ వాల్యుయేషన్ కు కెళ్ళిన వారు, దూర ప్రదేశాల వారు ఆ వార్త విని ప్రతివారు ఆశ్చర్యపోవడమే. ఆ రోజంతా ఎవరూ భోజనం చేయలేదు. ఆ రోజు రాత్రి 10 గంటల వరకు వున్నాను మాస్టారుగారి దగ్గర. ఆ మర్నాడు అంటే గురువారం పొద్దున్నే మాస్టరుగారింటి కెళ్ళాను.

మిగతా 26వ పేజీలో

మాతృదేవి దివ్య సన్నిధిలో దత్త జయంతి వేడుకలు !

శ్రీమతి టి.పద్మావతి

డిసెంబర్ 26,2023మంగళవారం, మార్గశీర్ష పౌర్ణమి రోజున 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' లో ఉదయం దత్త స్వరూపులైన పూజ్యశ్రీ సాయినాథులవారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు సేవతో దత్త జయంతి ఉత్సవం మొదలైంది.

తరువాత మాతృదేవి సమాధికి విశేష అభిషేకం, అనంతరం శ్రీ గురుచరిత్ర పారాయణ, అల్పాహార నివేదన యివన్నీ ఎంతో శ్రద్ధా భక్తులతో నిర్వహించబడ్డాయి. పూజ్యశ్రీ అమ్మగారి దివ్యసమాధికి అలంకరణ కొనసాగుతుండగా గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగం చేశారు. ఆ సత్సంగంలో వారు ప్రవచించిన విషయాలలో కొన్నింటిని యిప్పుడు మనం చెప్పుకుందాము:

అత్రి మహర్షికి, అనసూయా దేవికి దత్తమూర్తిగా అవతరించి, మానవాళిని ఉద్ధరించడానికి సద్గురుమూర్తిగా నిలిచి; అనేక అవధూతలు, ఋషులు, మునులు, మహనీయుల రూపంలో ప్రపంచంలో అనేకచోట్ల భక్తులను ఉద్ధరించడానికి అనేక రూపాలలో అవతరించిన దత్తాత్రేయ స్వామికి వందనములు సమర్పిస్తూ, ఇక్కడ పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో దత్తస్వామికి పూజ చేసుకోగలిగే మహదవకాశం మనకు లభించడం ఎంతటి అదృష్టమో గుర్తుపెట్టుకోవాలి. ఏ తత్వం అయితే సృష్టిలో అన్ని రూపాల్లో ప్రకటమై నడిపిస్తోందో, అదే శక్తి మనల్ని ఉద్ధరించడానికి సద్గురువుల రూపంలో అవతరించి, ఎన్నో బోధలు, లీలలు చేస్తూ వారిని ఆశ్రయించి తరించడం ఎలాగో చెప్తున్నా, మనలో చాలినంత మార్పు ఎందుకు రావడం లేదు అన్నది గమనించుకోవాలి. దానికి ముఖ్య కారణం మన మానసిక స్థితి!! మన మనసు ఎప్పుడూ రకరకాలుగా వుంటుంది. అందువల్ల ధ్యాస కలిగి పనిచేయడం తెలియాలి. అలా పనిచేయడాన్ని బౌద్ధులు 'సమ్యక్ శ్రద్ధ' అని చెప్పారు. ఇంకొంతమంది, నామస్మరణ, జపం యిలాంటివి చెప్పారు. అవి పాటిస్తున్నప్పుడు అన్యమైన భావన వస్తే గుర్తించమన్నారు. మనలో పైన చెప్పినవి ఏవీ మనసులో నాటుకోకపోవడమే యింతటి దత్తస్వామి అవతరించినా తగినంతగా సేవించుకోకపోవడానికి కారణం.

మనసు స్థిరంగా వుండడానికి కొన్ని సూచనలు చెప్పారు. అదేమిటంటే, మన మనసు నిరంతరం స్థిరంగా వుండడానికి ఒక ఆధార యివ్వబడుతుంది. ఉదాహరణకి సేవాభావం, లీలా చింతన, నామాజపం,,,యిలా,,, అవి చేసుకుంటూ మనలో వచ్చే భావాలని చూసుకుంటూ వుండాలి. అంతేకాదు వాటిని సమన్వయం చేసుకొని సంస్కరించుకుంటూ పోవాలి. అప్పుడు గాని మంచి లక్షణాలు మనలో రావు. ఇవన్నీ చేసినప్పుడే మన మనసు స్థిరమవుతుంది. ఒక్కొక్కసారి పైన సూచించిన మార్గాలన్నీ కూడా మనకు నచ్చకపోవడం గాని, చేస్తూ వుంటే ఆసక్తి సన్నగిల్లటం గానీ జరుగుతుంది. అటువంటి వాళ్ళని సంశయులు అన్నారు. మరి అది స్థిరం అవడం ఎలా అంటే, ముందు మనకి దాని 'విలువ' తెలియాలి. దాన్ని అభ్యసించడానికి తగిన 'క్రమశిక్షణ' వుండాలి. ఎంతోమంది మహాత్ములు యీ భూమి మీద అవతరించారు. వాళ్ళని తెలుసుకొని వాళ్ళు ఎట్లా ఆచరించారో

మనం కూడా అట్లా చేసి తరించవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారు, వారి గురువు గారైన బాబా గురించి చెప్తూ, 'ఎట్టి నియమాలు పెట్టక చాలా సులభంగా అనుగ్రహిస్తారు' అన్నారు. అంటే మరి, కాకబలి, పారాయణ, సత్సంగం, శిరిడీ యాత్ర యివన్నీ నియమాలు కావా? అనిపిస్తుంది, ఆయన నచ్చి, వారు చెప్పింది చేయాలని అనిపించేంతవరకు అవి నియమాలు, ఒక్కసారి నచ్చాక అవన్నీ చేయకుండా వుండలేని పరిస్థితి మన మనసుకి వస్తుంది. అప్పుడు అది సులభతరం!!

దత్తస్వామి ఎందరో మహనీయుల రూపంలో, అన్ని జీవులను ఉద్ధరించేదాకా తిరిగి తిరిగి అవతరిస్తూ వుంటానని కంకణం కట్టుకున్నారు. 'ఇవేమీ చేయను' అన్న వాళ్ల చేత కూడా బెండు తీసి మరీ సాధన చేయిస్తాడు. కనుక మనం మన జీవితానికి, సమయానికి విలువని ఆపాదించుకొని వారు చెప్పినట్లు చేస్తే తొందర్లో పూర్ణత్వం సిద్ధిస్తుంది. లేదా మన జీవితమే మనకు అడ్డంగా నిలుస్తుంది. జరుగుతున్న యీ మహత్తర లీలని గుర్తించి, వారు చెప్పిన మార్గంలో నడవడానికి చేయూతనిచ్చి ఉద్ధరించమని ప్రార్థిస్తూ, ఇప్పుడు దత్త జయంతి సందర్భంగా పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో దత్తస్వామికి పూజ చేసుకుందామని అంటూ వారి ప్రసంగాన్ని ముగించారు.

ప్రత్యేకంగా అలంకరించిన దత్తస్వామికి శ్రీమతి లయరాగిత, శ్రీ ద్వారకనాథ్ దంపతులు విశేషపూజ గావించారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండరుని విడుదల చేశారు. తర్వాత భక్తులు ఒక్కొక్కరుగా వెళ్లి దత్తస్వామికి పూజ్యశ్రీ బాబా, మాస్టరుగారు, అమ్మగార్లకి నమస్కరించుకుని, మధ్యాహ్న హారతి చేసుకుని ప్రసాదం తీసుకోవడంతో దత్తజయంతి ఉత్సవాలు ముగిసాయి!!

మాతృదేవి స్మృతులు

13వ పేజీ తరువాయి

కనిపించేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించేవారు కాదు. చిన్నప్పటినుంచి శ్రీ సాయిలీలామృతము పారాయణ చేస్తాను. నాకు వివాహమై సంవత్సరమైంది. ఇపుడు హైదరాబాదులో వుంటున్నాము.

సన్నిధిలో సేవ చేసేటప్పుడు మాకు ఇచ్చిన గదిలో ఒకరోజు రాత్రి పడుకుని వున్నాను. స్వప్నంలో బాబా, పూజ్యశ్రీ అమ్మగారు దర్శనమిచ్చి ప్రతిరోజూ ఉదయం లేవగానే వాళ్ళిద్దరికీ నమస్కారం చేసుకోమని చెప్పారు. అప్పటినుంచీ అలాగే చేస్తున్నాను.

ఇక్కడ హైదరాబాదులో వున్నప్పటికీ పూజ్యశ్రీ అమ్మగారు గుర్తుకు వస్తూ వుంటారు. మళ్ళీ సేవకి వచ్చే అవకాశం యివ్వమని ప్రార్థిస్తూవుంటాను. ఎప్పటికీ పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమ ఇలాగే పొందాలని కోరుకుంటూ, మాతృదేవి పాదాలకు నా నమస్కారాలు తెలుపుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

సమాధి లీల

24వ పేజీ తరువాయి

ఈనాడులో మాస్టరుగారి కలర్ ఫోటో, న్యూస్ పేపర్ అన్నింటిలో ఈ వార్త వేశారు. భక్తులంతా మాస్టరుగారిని మందిర ప్రాంగణంలో సమాధి చేయాలని పట్టుబట్టారు. మాస్టర్ గారి సంబంధీకులకు అది ఇష్టం లేక పోయినా, భక్తుల అభీష్టానికి అనుగుణంగా సరే నన్నారు. రకానికొకటి పంచామృతాలతో స్నానం చేయించారు అనంత కృష్ణగారు. వూరేగింపు మాస్టరుగారింటి నుంచి బయలు దేరి గాంధీరోడ్, ఏనుగు చెట్టు మీదుగా వచ్చి చివరకు మందిరం చేరుకుంటే, ఆరోజు వూళ్ళో వున్న పూలదండలన్నీ మాస్టరుగారి కంఠసీమనే అలంకరించాయి. ఆ రోజు పూలు ఇంకెవరికీ దొరకలేదు. మధ్యలో శ్రీరామ నవమి పందిళ్ళు కొన్ని చోట్ల లారీలకు అడ్డం వస్తే తాటాకులు తీయాల్సి వచ్చింది. భక్తుల ఆధ్వర్యంలో మాస్టరుగార్ని సమాధి చేశారు.

మందిరానికి వచ్చే భక్తుల సంఖ్య రాను రాను పెరిగిపోతున్నది. క్రొత్త వారెంతమందో వస్తున్నారు. మాస్టరుగారుంటే ఇంకా పది మందికి బాబాను గురించి తెలియ చెప్పేవారు కదా. బాబా గురించి, సాయితత్వాన్ని గురించి ఇంకా ఎంతో ప్రచారం జరిగి వుండేది కదా అనే లోటును ఇప్పటికీ నేను ఫీల్ అవుతూనే వుంటాను. ●

ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి పిసుపాటి సుబ్బమ్మ

నేను న్యూఢిల్లీలో మా మూడో అబ్బాయి యింట్లో వుంటుండగా తీవ్రమైన చలి కుదుపులతో జ్వరము వచ్చినది. ఆ సమయంలో మా అబ్బాయి ఊరిలో లేడు. మా కోడలు ఒక్కతే వుండగా సాయంకాలము నాకు జ్వరము తీవ్రమయినది. అప్పుడు మా కోడలు ఇతరుల సహాయంతో నన్ను ఆస్పత్రిలో చేర్పించింది. డాక్టర్లు పరిస్థితి చాలా ప్రమాదంగా వుంది. కనుక మీ వాళ్ళందరికి టెలిగ్రాములు యిచ్చుకోమని చెప్పేశారు. అప్పుడు మా కోడలు కంగారుపడిపోయి సాయిబాబాను తల్చుకుని, "బాబా! నీ చిత్రపటం, నువ్వు వేరుకాదని చెప్పావు కదా! నా భర్త ఇంటిదగ్గర లేకుండా యిటువంటి ప్రమాదం వచ్చింది. ఆయన వచ్చేదాకా నీ సత్యం చూపించి నువ్వే కాపాడాలి" అని నమస్కారం చేసుకుంది. డాక్టర్లు వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేశారుట. ఒక రోజంతా స్పృహలో లేకుండా పడివున్నాను. మర్నాటికి కొద్దిగా తెలివి వచ్చింది. అప్పుడు డాక్టర్లు ఇంక ఫరవా లేదన్నారట. అప్పుడు నాకు నిద్రా మెలకువా కాని పరిస్థితిలో ఎదురుగా తెల్లటి బట్టలు, గడ్డముగల ఆజానుబాహువయిన ముసలాయన కనిపిస్తున్నారు. ఆయన ఏవో మంత్రాలు చదువుతూ చేత్తో అక్షింతలు వేస్తూ ఏదో ఆశీర్వదిస్తున్నట్టుగా నాకు చాలాసేపు కనబడింది. అప్పుడు నేను "ఆ ముసలాయన ఎవరో వచ్చి అలా నిల్చుండిపోయారు. కూర్చోమని చెప్పండి" అని మావాళ్ళతో చెపితే, "ఇక్కడ ఎవరూ లేరు. మాకు ఎవరూ కనపడటం లేదు" అని వాళ్ళందరూ అన్నారు. నాకు బాగా తగ్గిపోయిన తరువాత ఈ దృశ్యం అంతా వాళ్ళకు చెప్పితే "నీకు బాబాయే అలా దర్శనం యిచ్చి నిన్ను

కాపాడారు. మా కెవరికీ కనపడలేదు. ఇదంతా ఆయన అనుగ్రహమేను" అన్నారు. టెలిగ్రాము అందుకుని నా కుమారుడు వచ్చేటప్పటికి ప్రమాదం తప్పింది. మీరు చాలా అదృష్టవంతులని అందరూ అన్నారు. ఇది సాయిబాబా లీల. నమ్మినవాళ్ళకు తప్పక బాబా వున్నారు.●

ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీ దామోదర్, గుంటూరు

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని గుంటూరు వాస్తవ్యులు దామోదర్ చౌదరిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

1969 వ సంవత్సరంలో విద్యానగరులో డిగ్రీలో చేరాను. అక్కడే నాకు పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయభాగ్యం కలిగింది. 1969లో పూజ్యశ్రీ మాస్టరుగారు ఇంగ్లీషు విభాగానికి హెడ్ గా విద్యానగర్ కళాశాల్లో చేరారు. మాకు డిగ్రీలో ఇంగ్లీషుకి వచ్చేవారు. అందులో ఓ అధ్యాయం 'Concept of God' చెప్తున్నప్పుడు అందులోని కొన్ని విషయాలపై మరింత ఎక్కువగా తెలుసుకోవాలని సాయంత్రం పూజ్యశ్రీ మాస్టరుగారి గదికి వెళ్ళేవాడిని. భగవంతుని ఉనికికి ఉదాహరణగా శిరిడీ సాయిబాబా గురించి, వారి లీలల గురించీ చెప్పేవారు. ఆ కాలంలో శిరిడీ సాయిబాబా గురించి ఎక్కువమందికి తెలియదు. పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి దయవల్ల ఈనాడు ఇంతమంది బాబా గురించి తెలుసుకోగలిగారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకసారి నాకు కార్డు సైజు బాబా ఫోటో, ఇంగ్లీషు సాయి సచ్చరిత్ర ప్రసాదించారు. ప్రతిరోజూ పూజ, పారాయణ రెండు పూటలా చేసుకుంటే బాబా అనుగ్రహం లభిస్తుందని చెప్పారు. వారి దయవల్ల ఈరోజు వరకూ పారాయణ కొనసాగుతోంది. PUC తక్కువ మార్కులతో పాసయ్యాను. అయినా పూజ్యశ్రీ మాస్టరుగారి సాంగత్యం వల్ల డిగ్రీలో మంచి మార్కులతో ఉత్తీర్ణుడినయ్యాను.

ప్రతి గురువారం పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగం చేసేవారు. అప్పుడు చుట్టుపక్కల గ్రామాలనుంచి కూడా చాలామంది వచ్చేవారు. నేను తప్పక ఆ సత్సంగానికి హాజరయ్యేవాడిని.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు, నేనూ కలిసి నెల్లూరులోని ఒక అవధూత దర్శనానికి వెళ్ళాము. అక్కడ లౌకికంగా ప్రాముఖ్యం వున్నవాళ్లకే ఎక్కువ అవకాశం వున్నట్లు అనిపించింది. మేము సాయంత్రం వరకు ఎదురుచూసినా మాకు వారిని దర్శించుకునే అవకాశం రాలేదు. తిరుగు ప్రయాణంలో నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో, "సార్! మనము ఇటువంటివారి దర్శనానికి వచ్చే బదులు మన ఇంట్లోనే బాబాని పూజించుకుంటే బాగుండేదేమో!" అన్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమన్నారో గుర్తులేదు కానీ, నేను విద్యానగర్ విడిచి వెళ్ళాక ఒక్క అవధూత దర్శనం కూడా ఇప్పటివరకూ కాలేదు. నేను కర్నూలులో పనిచేసినప్పుడు అక్కడ రామిరెడ్డితాత వున్నారన్న విషయం తెలియలేదు. అక్కడ చుట్టుపక్కల వున్న మన సత్సంగసభ్యులతో పరిచయముండేది. కానీ వారెవరూ నాతో ఒక్కసారి కూడా ఆయన గురించి చెప్పలేదు! విజయనగరంలో పనిచేసేటప్పుడు అక్కడ దగ్గరలో పాకలపాటి గురువుగారు వున్నారని తెలియలేదు. నేను ఆఫీస్ పనిమీద చింతపల్లి కూడా వెళ్లాను. అయినా నేను వారి సమాధిని దర్శించుకోలేకపోయాను. నాకు ఎప్పుడూ ఆఫీస్ జీప్ అందుబాటులోనే వుండేది. కానీ నేను ఎవ్వరినీ దర్శించలేకపోయాను. బహుశా పూజ్యశ్రీ మాస్టరుగారికి నేనిచ్చిన ఉచిత సలహానే దానికి కారణమేమో! .

డిగ్రీ పూర్తయ్యాక తిరుపతి



విశ్వవిద్యాలయం లో జంతుశాస్త్రంలో పీ.జీ. చదవడానికి దరఖాస్తు చేసుకున్నాను. అక్కడ వున్న సీట్లు 30 మాత్రమే. నాకు సీట్ రాదనుకున్నాను. కానీ ఒకసారి స్వప్నంలో ఆ విశ్వవిద్యాలయంలో సైన్స్ భవనంలో నేలపై పరచిన టైల్స్ కనిపించాయి. అప్పటివరకూ నేను ఆ కాలేజీని చూడలేదు. చివరికి నాకు అక్కడ సీట్ వచ్చాక అక్కడి నేలమీద టైల్స్ నాకు కలలో కనిపించినట్లే వుండటం చూసి చాలా ఆశ్చర్యమేసింది.

అక్కడ చదువు పూర్తయిన తరవాత, 1977 లో పట్టు పరిశ్రమ విభాగంలో శిక్షణకు ఎంపికయ్యాను. శిక్షణ పూర్తయిన తరువాత నియామక ఉత్తర్వులు ఆలస్యమవుతున్నాయి. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు జనవరి 18, 1979 వ తేదీన వెళ్లి నా ఉద్యోగవిషయం ప్రస్తావించాను. “ఉత్తర్వులు వస్తాయిలే!” అన్నారు ఆయన. ఆరోజు రాత్రి అక్కడి సత్సంగ హాల్లోనే పడుకున్నాను. మర్నాడు తిరుపతి వెళ్లాలని నా ప్రణాళిక. ఆ రోజు రాత్రి స్వప్నం వచ్చింది. అందులో నేను ఆలస్యంగా నిద్ర లేచానట. బస్సు అందుకోలేనేమోనని కంగారుపడుతున్నానుట. అదే స్వప్నంలో, “కంగారు వద్దు! బస్సు దొరుకుతుంది” అని వినిపించింది. మర్నాడు అదేవిధంగా జరిగింది. 19వ తేదీ తిరుపతిలో మళ్ళీ స్వప్నం వచ్చింది. అందులో నా ఉద్యోగ ఉత్తర్వులు ప్రత్యక్షముగా కనిపించాయి. 20వ తేదీకి నిజంగానే ఉద్యోగంలో చేరమని ఆర్డర్స్ వచ్చాయి. తిరుపతిలో వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని 22వ తేదీన చిత్తూరు జిల్లా, పలమనేరులో ఉద్యోగంలో చేరాను. ఇదంతా పూర్తిగా పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సుల ఫలితమే!!

తరవాత నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని కలిసినప్పుడు, “బాబా గురించి పదిమందికి తెలియచెప్పు!” అని చెప్పారు. వారికి ఇంతకన్నా కావలసిందేదీ లేదు. 1988లో నేను శిరిడీ వెళ్లాలనుకుంటున్నానని పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తరం వ్రాశాను. ఆయన, “శిరిడీలో తెలుగువారి చేతిలో నా గ్రంథాలుంటాయి. వారిని పరిచయం చేసుకో!” అని వ్రాశారు. అలా నాకు చాలామంది తెలుగువారు అక్కడ పరిచయమయ్యారు. నా బాధ్యతల వల్ల తరవాత కాలంలో పూజ్యశ్రీ మాస్టరుగారితో అంతగా అనుబంధం పెంచుకోలేకపోయాను.

ఆయన దయవల్ల నాకు వివాహమై, మా పిల్లలు నేను ఊహించనంత ఉన్నతంగా స్థిరపడ్డారు. నాకు మంచి ఉద్యోగిగా పేరొచ్చింది. అప్పుడప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్న దర్శనమిస్తూ వుంటారు. వారు చెప్పిన పూజ, పారాయణ మాత్రం ఇప్పటివరకు మానకుండా కొనసాగిస్తున్నాను. నన్ను రెండు, మూడుసార్లు ఘోర ప్రమాదాలనుంచి కాపాడారు. ఏవైనా క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు బాబాను, పూజ్యశ్రీ మాస్టరుగారిని స్మరిస్తే చాలు, అంతా సజావుగా జరిగిపోయేది!

నా ఉద్యోగ బాధ్యతలు పూర్తిచేసుకుని ఇప్పుడు గుంటూరులో వుంటున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు సమాధి చెందాక 2021 జూన్ 12 వ తేదీన, మా పూజామందిరం పక్కనే నిలబడి గురుదంపతులు నాకు స్వప్న దర్శనమిచ్చి, ఇంట్లో అఖండదీపం పెట్టమని ఆదేశించారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో, “ప్రతిరోజూ దీపారాధన చేస్తున్నాను మాస్టరుగారూ!” అంటే, “అది కాదు, అఖండదీపం పెట్టు!” అన్నారు. పైగా స్వప్నంలోనే నేను అఖండదీపం పెట్టినట్లు చూపించారు కూడా! తరవాత నేను స్వప్నసందేశం ప్రకారం 24 గంటలు అఖండదీపం పెట్టాను. పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహంవల్ల వైద్యుడైన మా అబ్బాయి ఈమధ్యనే క్లినిక్ ప్రారంభించుకున్నాడు.

కరోనా సమయంలో కూడా మా తోటి సాయిమాస్టర్ సత్సంగసభ్యులందరితో కలిసి ఆన్లైన్ సత్సంగాలు చేసుకుంటూ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి స్మరణలో సమయం గడిపాము. నిరంతరం వారి స్మరణలో గడుపుతూ, వారి కృపాశీస్సులు పొందే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకుంటూ ఆ సద్గురుమూర్తికి నమస్కరిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole

శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

శ్రీ గురు చరిత్ర - శ్రీ సాయి లీలామృతము (బౌండ్)	₹499.00
శ్రీ గురు చరిత్ర	₹199.00
శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి	₹149.00
శ్రీ దత్తావతార మహాత్మ్యము	₹75.00

శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

శ్రీ సాయి లీలామృతము	₹199.00
శ్రీ సాయి సన్నిధి	₹199.00
శ్రీ సాయినాథ ప్రబోధామృతము.	₹119.00
శ్రీ సాయినాథ పూజ	₹49.00
శిరిడీ హారతులు	₹15.00
శిరిడీ క్షేత్ర సందర్శనము	₹49.00
శ్రీ సాయినాథ స్తవన మంజరి	₹10.00
సాయిని పూజించడం ఎందుకు?	₹10.00
సత్సంగము - భజన	₹10.00
సాయి సూక్తి - ఆచార్యవాణి	₹20.00
శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ)	₹20.00

ఇతర మహాత్ముల గ్రంథములు

శ్రీ స్వామి సమర్థ	₹75.00
శ్రీ తాజుద్దీన్ బాబా	₹75.00
అవధూత శ్రీ వెంకయ్య స్వామి	₹99.00
అవధూత శ్రీ చీరాల స్వామి	₹75.00
శ్రీ పాకలపాటి గురువుగారు	₹75.00
శ్రీ ఆనందమయి అమ్మ	₹75.00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	₹99.00
శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్)	₹99.00
అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్)	₹99.00

అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

ఏది నిజం?	₹49.00
మతం ఎందుకు?	₹49.00
విజ్ఞాన వీచికలు	₹99.00
పరిప్రశ్న	₹119.00

ధ్యాన సంబంధమైన గ్రంథములు

ధ్యానయోగ సర్వస్వము	₹99.00
బుద్ధ ధ్యాన హృదయము	₹49.00

ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	₹199.00
ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ)	₹199.00

ఇతర గ్రంథములు

పురుషసూక్త రహస్యము	₹49.00
మనము - మన సంస్కృతి	₹75.00

పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి)	₹149.00
భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి)	₹299.00
మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ)	₹60.00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు -1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ)	₹199.00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు -2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ)	₹199.00
ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి)	₹199.00
మరో నంద దీపం	₹120.00
మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి)	₹99.00

బాలల కొరకు విరచితమైన గ్రంథములు

బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి)	₹49.00
బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి)	₹75.00
బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి)	₹75.00

BOOKS IN ENGLISH

Sai Baba The Master	₹249.00
Shri Guru Charitra	₹149.00
Supreme Master	₹149.00
Tajuddin Baba	₹149.00
Sai Baba and His Teachings	₹149.00
Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)*	₹80.00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sri Sai Baba (Hindi)	₹249.00
Sri Guru Charitra (Hindi)	₹249.00
Sri Sai Leelamruthamu (Kannada)	₹249.00
Sri Sainatha Prabodhamruthamu (Kannada)	₹149.00
Sri Guru Charitra (Kannada)	₹199.00
Sri Sai Sannidhi (Kannada)	₹249.00
Tibet Yogi Milarepa Charitra (Kannada)	₹119.00
Sri Swami Samartha (Kannada)	₹119.00
Sri Sai Leelamruthamu (Tamil)	₹249.00
Sri Guru Charitra (Tamil)	₹299.00
Sri Shirdi Sai Aartulu (Tamil)	₹29.00
Sri Sainatha Stavana Manjari (Tamil)	₹20.00
Sri Sai Leelamruthamu (Malyalam)	₹299.00
Sri Guru Charitra (Malyalam)	₹299.00
Sri Guru Charitra (Odiya)	₹299.00
Sri Sai Sannidhi (Odiya)	₹249.00